Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 31.03.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 43 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# రాష్ట్రంలో గూండా రాజ్యం!




**అభివృద్ధిలో ఏపిని దేశంలోనే నెంబర్ వన్ చేస్తానని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పదేపదే చెబుతున్నాడు. అయితే రాష్ట్రం అభివృద్ధిలో నెంబర్‌వన్ కావడంలేదు గాని అవినీతిలో మాత్రం నెంబర్‌వన్‌గా వుందని ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడి కావడం తెలిసిందే!**

ఒక రాష్ట్రం అవినీతిలో అగ్రస్థానంలో వున్నా ఇబ్బంది లేదేమోగాని శాంతిభద్రతల విషయంలో విఫలమైతే మాత్రం అభివృద్ధి పరంగా అంగుళం కూడా ముందుకు కదిలే పరిస్థితి ఉండదు. రాష్ట్రంలో రౌడీయిజం పెరిగి, అధికారుల మీద దాడులు జరిగి, ప్రజాప్రతినిధులే దౌర్జన్యాలకు పాల్పడుతుంటే... ఇక ఆ రాష్ట్రం వైపు కన్నెత్తి చూసేదెవరు? పెట్టుబడులు పెట్ట డానికి వచ్చేదెవరు?

ఏపిని అభివృద్ధిలో నెంబర్‌వన్ చేయడం మాటేమోగాని ప్రశాంతంగా వున్న రాష్ట్రాన్ని మరో బీహార్‌గా మారుస్తుంది ఈ ప్రభుత్వం. ఈరోజు బీహార్‌లో గుండాగిరి అంతరించి అభివృద్ధికి బీజం పడింది. అదే సమయంలో ఏపిలో అభివృద్ధి సంస్కృతి తెరమరుగై గూండారాజ్ సంస్కృతికి తెరలేచింది. రాష్ట్రంలో అధికారపార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. రాష్ట్రానికి బెజవాడ రాజధాని అయితే ఎలాంటి అరాచకాలు జరుగుతాయని ప్రజలు భయపడ్డారో ఇప్పుడు అదే జరుగుతోంది. రౌడీ సంస్కృతికి బెజవాడ పుట్టిల్లు. అలాంటి బెజవాడను పరిపాలనా కేంద్రంగా చేసుకుంటే అధికారులు అక్కడ ప్రశాంతంగా పనులు చేయలేరన డానికి మొన్న జరిగిన సంఘటనే ఒక ఉదాహరణ. ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు యాక్సిడెంట్ కేసుకు సంబంధించి తాము చెప్పినట్లు రిపోర్ట్ తయారు (మిగతా 11వ పేజీలో)

## వియ్యంకులు...
# లీకు వీరులు!

- లక్షలమంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం
- నేరం మాది కాదంటూ తప్పించుకున్న మంత్రులు





*స్వర్గీయ నందమూరి తారక రామారావు **1985**లో రెండోసారి గెలిచి ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో గాలి ముద్దుకృష్ణమనాయుడు ఉన్నత విద్యాశాఖామంత్రిగా వుండినాడు. ఒక ఏడాది పదో తరగతి ప్రశ్నాపత్రం లీకైంది... అది కూడా ఒక సబ్జెక్ట్ పేపర్. రెండో ఆలోచన, రెండో వివ రణ లేకుండా పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ గాలి ముద్దుకృష్ణమ నాయుడు మంత్రి పదవికి రాజీనామా చేశాడు. విలువలంటే అవి. నైతిక ప్రవర్తన అంటే అది. ఆరోజు రాజీ నామా చేసిన మంత్రే కాదు, వారికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి కూడా నైతిక విలువలకు కట్టుబడిన మనిషి. పరిస్థితులతో రాజీపడని నాయ కుడు. కాబట్టే ఒక నాయకుడు తృణ ప్రాయంగా మంత్రి పదవిని వదులు కోగలిగాడు.*

ఇప్పుడు కూడా పార్టీ అదే. కాక పోతే నాయకులు మారారు. నేతృత్వం వహిస్తున్న వాళ్ళు పాటిస్తున్న సిద్ధాం తాలు కూడా మారాయి. విలువలు, నైతిక బాధ్యత అన్నవి అక్కడ కనపడవు. అవతల పార్టీలో గెలిచిన 21మంది ఎమ్మె ల్యేలను తన పార్టీలో చేర్చుకుని మంత్రి పదవులు (మిగతా 11వ పేజీలో)

## మంత్రిగా ఒకరు..
# మండలికి మరొకరు?





- కుల సమీకరణతో మారుతున్న లెక్కలు
- బిసి కార్డుతో బీద, రెడ్డి ముద్రతో సోమిరెడ్డి

*ఈ వారంలో జిల్లా రాజకీయా లలో కీలక పరిణామాలు చోటుచేసు కోబోతున్నాయి. చంద్రబాబు మంత్రి వర్గాన్ని ఈ వారంలోనే విస్తరించబో తున్నాడు. నెల్లూరుజిల్లా నుండి ఇంకొ కరికి మంత్రి పదవి ఖాయంగా కని పిస్తోంది. ఇప్పటికే జిల్లా నుండి నారా యణ మంత్రిగా వున్నాడు. అయితే ఆయన వల్ల జిల్లాలో పార్టీకి ఎటువంటి రాజకీయ ప్రయోజనం లేదు, సరికదా అతని మూలంగా పార్టీకి నష్టమనేది మొన్నటి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలోనే తేలిపోయింది. కాకపోతే నారాయణను మంత్రి పదవి నుండి తప్పించలేరు. చంద్రబాబుకు ఆయనకు వున్న అనుబంధం అలాంటిది.*

జిల్లాలో పార్టీ రాజకీయ ప్రయోజ నాల దృష్ట్యా ప్రజలతో, పార్టీ కేడర్‌తో సంబంధాలున్న ఇంకో నాయకుడికి మంత్రి పదవి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. మొదటి నుండి పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ కష్టకాలం లోనూ ముందుండి నడిచిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లైన్‌లో వున్నాడు. ప్రతిపక్షనేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై అర్థవంతమైన విమర్శలతో దాడి చేసిన వారిలో అగ్రభాగాన నిలిచిన వ్యక్తి. మొన్న ఎమ్మెల్సీ (మిగతా 11వ పేజీలో)



# కరువు వాత... కనిపించని మేత



- గడ్డి కరువుతో మూగజీవాలు విలవిల
- పట్టించుకోని ప్రభుత్వం..నిర్లక్ష్యంలో అధికారగణం


నీళ్ళు లేక, మేత దొరక్క మూగజీవాల ప్రాణాలు పోతున్నా అటు ప్రభుత్వం కానీ, ఇటు జిల్లా అధికారగణం కానీ పట్టించుకోవడం లేదు. మండే ఎండల్లో నోళ్ళు పిడచకట్టుకుపోయి ఆవులు, గేదెలు తదితర మూగజీవాలు విలవిలలాడుతున్నా ఎవరికీ పట్టడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు నిత్యం పడుతున్న వేదనలను అసలు పట్టించుకునేవారే లేరు. రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టామని, రైతుదే రాజ్యమని, తమది రైతు ప్రభుత్వమని ఇలా రకరకాలుగా మభ్యపెట్టే ప్రకటనలే తప్ప ఆచరణలో రైతుల దుస్థితిని పట్టించుకునేవారెవరూ లేరు. మూడుకార్లు పంటలతో సస్యశ్యామలంగా వుండే నెల్లూరుసీమలో చివరికి పచ్చిగడ్డికి, ఎండుగడ్డికి కూడా కరువొచ్చిందంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో తేటతెల్లమవుతుంది. చివరికి తాగేందుకు నీళ్ల లేక, మేత దొరక్క పాడిపశువులు, అనేకరకాల మూగజీవాలు బక్కచిక్కిపోయి.. ఊపిరి ఉగ్గబట్టుకుని బతుకుతున్నాయి. అటు ప్రభుత్వం కానీ, ఇటు అధికారులు కానీ దుస్థితిని పట్టించుకోకపోవడంతో రైతులు తమ మూగజీవాలను బతికించుకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్ళి వాటిని అత్యంత తక్కువ ధరకే అమ్మేసుకుంటున్నారు. అసలే వర్షాభావంతో నెల్లూరుసీమలోని అనేక మెట్ట ప్రాంతాలు ఇప్పుడు తీవ్రంగా కరువు బారిన పడివున్నాయి. పంటలు ఎటూ పండేది లేదు కానీ, కనీసం పశువులనైనా కాపాడుకుందామని అనుకున్నా ఆ ఆశలు కూడా ఆవిరైపోతున్నాయి. ఈ నేపథ్యంలో పేదరైతుల దుస్థితి మరింత దయనీయంగా వుంది. ముఖ్యంగా జిల్లాలోని మెట్టప్రాంతాల్లో వస్తే వడగళ్ళు..లేదంటే కన్నీళ్ళు అన్నట్లుగా వుంది పరిస్థితి. ఈ మండే ఎండల్లో ఎక్కడా చుక్క నీరు దొరక్క పశువులు, మేకలు వగైరా జంతుజాలమంతా పిడచకట్టుకుపోతున్న గొంతులతో విలవిలలాడుతున్నాయి. వానలు కురవక, భూగర్భ జలాలు అడుగంటిపోయి, చెరువులు దొరువులు కాలువలన్నీ ఎండిపోయి మెట్ట ప్రాంతాల్లోని అనేక మండలాలు బీడుపడిపోతున్నాయి. ఎక్కడ వెతికినా పచ్చిగడ్డి కాదు కదా, కనీసం ఎండుగడ్డి కూడా దొరకడం లేదు. దీంతో, ఇంతకాలం కన్నబిడ్డలా పెంచుకున్న ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నలు వగైరాలన్నిటినీ ఇక సాకలేక అతితక్కువ ధరకే రైతులు అమ్మేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మేత లేక పశువులు అల్లాడుతుంటే, తమ కళ్ళ ముందే అవి బక్కచిక్కిపోయి చావుకు దగ్గరవుతుంటే రైతులు చూడలేక కడివెడు కన్నీటితో వాటిని అమ్మేసుకుంటున్న దయనీయ దృశ్యాలు ఇప్పుడు మెట్టప్రాంతాల్లో కోకొల్లలు. ముఖ్యంగా, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, కలువాయి, చేజర్ల, రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, బాలాయపల్లి, తడ, సూళ్ళూరుపేట, నాయుడుపేట, దొరవారిసత్రం, ఏఎస్‌పేట, అనంతసాగరం, బోగోలు, జలదంకి, మర్రిపాడు, గూడూరు, వెంకటాచలం తదితర అనేక మండలాల్లో కరువు ముసురుకుంది. తాగేందుకు నీళ్ళు, తినేందుకు మేత లేక తమవైపే దీనంగా చూస్తున్న మూగజీవాలను ఎలా పోషించుకోవాలో తెలియక అనేకమంది రైతులు ఇతరప్రాంతాలకు వాటిని తీసుకువెళ్ళి ఎంత తక్కువ ధరకైనా సరే వాటిని అమ్మేసుకుంటున్నారు. పూటకి కనీసం మూడు లీటర్ల పాలిచ్చే గేదెలను సైతం వాటి ధర కనీసం 60 వేలకు పైగానే వున్నా, ఈ కరువు పరిస్థితుల్లో అవి బతికుంటే చాలని కోరుకుంటూ పాతిక, ముప్పై వేలకే అమ్మేస్తున్నారు. పశుగ్రాసం దొరక్క రైతాంగం తీవ్రవేదన పడుతున్నా అటు ప్రభుత్వం కానీ, ఇటు జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం కానీ అసలు పట్టించుకోవడం లేదు. అందరికీ అన్నంపెట్టే అన్నదాతలు ఎంత దయనీయస్థితిలో వున్నా అటు అధికారుల్లో కానీ, ఇటు ప్రభుత్వంలో కానీ ఏమాత్రం స్పందన వుండడం లేదు. ఈ దుస్థితి ఇలాగే కొంతకాలం సాగితే మెట్ట ప్రాంతాల్లో పాడిపశువులు ఇక కనుమరుగైనట్లేనని రైతులు ఆవేదనతో చెప్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా యుద్ధప్రాతి పదికన పశుగ్రాసకేంద్రాలను –తాగునీటి వసతులను ఏర్పాటుచేసి మూగజీవాల ప్రాణాలు కాపాడి పుణ్యం కట్టుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

## సూళ్లూరుపేట సిఐకి సేవా పతకం

తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ విజయకృష్ణ రాష్ట్ర సేవా పతకానికి ఎంపికైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. విజయకృష్ణ సూళ్లూరుపేటలో బాధ్యతలు చేపట్టిన రెండేళ్ళ కాలంలో సుమారు రూ. 3కోట్లుపైగా రికవరీలు చేపట్టారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో కూడా ఆయన ప్రతిభ కనపరచడంతో ప్రభుత్వం సేవాపతకానికి ఎంపిక చేసింది.

## గూడూరులో ఉద్యోగావకాశాలు

నెల్లూరుజిల్లా గూడూరు ఏరియా ఆసుపత్రి ఏఆర్‌టి సెంటర్‌లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ –గూడూరు మెడికల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు యంబిబిఎస్ చదివి 62 సంవత్సరాలలోపు ఉండాలని, వేతనం రూ. 36,000లు ఉంటుందన్నారు. కౌన్సిలర్ పోస్టులు(2)కు ఎం.ఎ. లేక ఎంఎస్‌సి లేదా సైకాలజీ చదివి ఉండాలని, వేతనం రూ. 13,000/–లు ఉంటుందన్నారు. డేటా మేనేజర్ పోస్టుకు రూ. 13,000 వేతనం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిప్లొమా ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వారం రోజులులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## వెంకయ్య ఇంట..
# ఉగాది సందడి




**కేంద్రమంత్రి వెంకయ్యనాయుడి ఢిల్లీ నివాసంలో "ఉగాది" పండుగ మూడురోజుల ముందే వచ్చింది. మార్చి 26న ఆయన ఇంట్లో జరిగిన ఉగాది వేడుకలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహహాజన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రమణ, జస్టిస్ రోహిణి, జస్టిస్ చలమేశ్వర్‌తో పాటు పలువురు కేంద్రమంత్రులు, ప్రముఖులు, వెంకయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.**

న్యూఢిల్లీలోని కేంద్రమంత్రి వెంకయ్య నాయుడి అధికారనివాసంలో ఉగాది పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న జరిగిన ఉగాది వేడుకలు ఎంతో సందడిగా జరిగాయి. ప్రధాని మోడీతో పాటు, బిజెపి అగ్రనేత అద్వానీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రోహిణి, కేంద్ర మంత్రులు రవిశంకర్‌ప్రసాద్, మహేష్ శర్మ, ఎంపీ మాగంటి బాబు, తదితర ప్రముఖులంతా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడి మను మరాలు సుష్మ చిత్రించిన తన చిత్రాన్ని చూసి ప్రధాని మోదీ ఎంతో సంతోషించి 'శభాష్ భేటీ' అంటూ ఆమెను అభినం దించారు. తాను స్వయంగా చిత్రించిన మోదీ చిత్రాన్ని ఆమె ప్రధానికి బహుకరిం చారు. ప్రధాని ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి పలు పథకాల గురించి ఆమె ఒకే చిత్రంలో ప్రతిబింబించి ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్నారు. 'ఉగాది మిలాన్' పేరుతో జరిగిన ఈ ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొని అందరికీ ఉగాది శుభాకాం క్షలు తెలియజేశారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. మనదేశంలోని వివిధ రాష్ట్రాల్లో వున్న సంస్కృతులను, భిన్నత్వంలో ఏకత్వం వంటి అంశాలను భావితరాలవారు అర్థం చేసుకోవడానికి ఇలాంటి పండుగలు, వేడుకలు బాగా ఉపయోగపడతాయన్నారు. ఇది మన ఐక్యతకు నిదర్శనమన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌కు వున్న ప్రధానమైన శక్తి అని ప్రధాని పేర్కొన్నారు. సామూహికత అనేది భారతీయ జీవన వారసత్వమని, దీనిని పరిరక్షించుకోవాలని అన్నారు. దేశంలోని ప్రతిరాష్ట్రం మరొక రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను, భాష లను అర్థం చేసుకుంటే ఇబ్బందులన్నీ తొలగిపోయి 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్' అవతరిస్తుందన్నారు. దేశంలోని అన్ని భాషల సౌందర్యాన్ని తెలుసుకుని, నేర్చుకుని, అందులోని విశిష్టతను గుర్తించగలిగితే మన శక్తి మరెన్నోరెట్లు పెరగడంతో పాటు వివాదాలను అధిగమించగలుగుతామ న్నారు. ఉగ్రవాదం మానవత్వానికి పెను ముప్పుగా పరిణమించిందని, దానికి వ్యతి రేకంగా పోరాడాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రామా యణ కాలంలోని జటాయువు పోరాటమే అందుకు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఏటా వెంకయ్యనాయుడు నివాసంలో జరిగే ఉగాది వేడుకల్లో పాల్గొ నడం తనకెంతో సంతోషం కలిగిస్తోందని మోదీ అన్నారు. అనంతరం, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, జీవితాను భవాల కలయికే ఉగాది పండుగ అని అంటూ, ఉగాది పచ్చడిలో ఒక్కోరుచి ఒక్కో జీవితానుభవానికి సూచిక అని ఆయన అభివర్ణించారు. ఆ తర్వాత, ప్రముఖ పంచాంగకర్త మాడుగుల నాగఫణిశర్మ పంచాంగ పఠనం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోయి ప్రపంచవ్యాప్తంగా మరింత మంచి గుర్తింపు పొందుతుందని ఆయన పేర్కొన్నారు.







## రాష్ట్ర మంత్రులకు కోటంరెడ్డి వినతులు



నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలో పలు అంశాలపై మంత్రు లకు వినతులు అందజేశారు. ఎస్‌టిఎస్ ఛానల్ నుంచి కొమ్మరపూడి చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని ఇరిగేషన్ శాఖామంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుకు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. నెల్లూరు-పొదలకూరు రోడ్డు నుంచి సిద్దవరప్పాడు గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేస్తే వెంకటాచలం మండలంలోని కసుమూరు దర్గాకు వెళ్ళే యాత్రికులకు ఎంతో ఉప యోగకరంగా ఉంటుందని పంచాయితీరాజ్ శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడి దృష్టికి తీసుకెళ్ళగా దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. విఆర్ కళాశాల యాజమాన్య కమిటీని ఇటీవల రాష్ట్ర హైకోర్టు రద్దు చేసిన విషయం వాస్తవం అయితే కళాశాల ఆస్తులను పరిరక్షించడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనం కాపా డేందుకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో వివరాలు తెలపాలని విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే ప్రశ్నలను పంపారు.

## శ్రీసిటీని సందర్శించిన టిటిడి జెఇఓ



తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్యదర్శి పోలా భాస్కర్ బుధవారం తడకు విచ్చేసి శ్రీసిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డి రవీంద్రసన్నారెడ్డి ఆయనను స్వాగతించి, శ్రీసిటీ అభివృద్ధిని వివరించారు. సెజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వారు పర్యటించారు. శ్రీసిటీ ప్రగతి పథంలో పయనిస్తోందని ఈ సందర్భంగా జెఇఓ శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డిని అభినందించారు.

## వదంతులకు తెరదించిన ప్రసన్న



వైకాపా సీనియర్ నాయకుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తాను పార్టీ మారుతు న్నానన్న వదంతులకు తెరదించారు. తన రాజకీయ జీవితం చివరి క్షణం వరకు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వెంటే తన పయనమంటూ కుండబద్ధలుకొట్టారు.

ఇటీవలకాలంలో ప్రసన్న తెలుగు దేశం పార్టీలో చేరుతున్నాడంటూ పుకార్లు షికారు చేస్తున్నాయి. ఫేస్‌బుక్ లలోనూ పోస్ట్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. ఇటీవల స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో తనకు సీటు ఇవ్వలేదని ప్రసన్న అలిగాడని వార్తలొచ్చాయి. అసలు ప్రసన్న స్థానిక ఎమ్మెల్సీ సీటు అడగలేదు. అలాంటప్పుడు అలగాల్సిన అవసరమేముంది. అదీగాకుండా ఆయనే గనుక సీటు కావాలంటే ఇక ఇవ్వకుండా పోవడమేమిటి? ఆయన పోటీ చేసుంటే ఫైట్ ఇంకా టైట్ అయ్యుండేది కూడా!

ఇప్పటికప్పుడు తెలుగుదేశంలో చేరాల్సినంత అవసరం కూడా ఆయనకు లేదు. వైకాపాలో ఆయన గౌరవం ఆయనకుంది. ఆయన సీనియార్టీ ఆయ నది! 2014లో వైకాపా అధికారంలోకి వచ్చుంటే జిల్లా నుండి మంత్రి కూడా ఆయనే అయ్యుండేవాడు. జగన్మోహన్‌రెడ్డి అంత ప్రాధాన్యతనిస్తున్నాడాయనకు!

అయితే ప్రసన్నను తెలుగుదేశంలోకి లాగడానికి కొందరు చేసిన ప్రయత్నాలు నిజమేనని తెలుస్తోంది. ప్రసన్న సమీప బంధువులు జేసీ బ్రదర్స్ తెలుగుదేశంలో వున్నారు. ప్రసన్న మరో బావ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలుగుదేశంలోనే ఉన్నప్పటికీ ఆయనకు ఈయనకు పడదు. కాబట్టి ప్రసన్న కోసం జేసీ బ్రదర్సే ప్రయ త్నించారు. కాని ప్రసన్న వారి ప్రతిపాద నను తిరస్కరించినట్లు తెలుస్తోంది.

ప్రసన్న రాజకీయ ప్రస్థానం మొద లైందే తెలుగుదేశం పార్టీ నుండి. 1993లో కోవూరు ఉపఎన్నిక ద్వారా ఆయన మొదటిసారి ఎమ్మెల్యే అయ్యాడు. 1994, 1999లలో కూడా వరుసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టాడు. 2004లో ఓడిపోయాడు. 2009లో మళ్ళీ గెలిచాడు. అయితే అప్పుడు రెండోసారి కూడా తెలుగుదేశం అధికారంలోకి రాలేదు. దాంతో చంద్రబాబు నాయకత్వం మీద విరక్తి పెంచుకున్న ప్రసన్న ఆయనపై పదునైన విమర్శలు గుప్పించి వై.యస్. పక్కన చేరారు. ఆ చేరడం చేరడం వై.యస్. మరణం తర్వాత కూడా ఆయన కొడుకు జగన్‌నే నీడలా అంటిపెట్టుకుని కొనసాగుతున్నాడు.




## 'ప్రభా'తం

నదులు.. మానవ నాగరికతకు చిహ్నాలు. మానవ జీవిత ప్రస్థానం ప్రారంభమైంది కూడా నదీపరీవాహిక ప్రాంతాల్లోనే. నదీమతల్లుల చల్లని ఒడిలోనే ప్రాచీన మానవుడూ ఎదిగాడు. మానవునికీ-నదులకీ వున్న అనుబంధం మానవుడు పుట్టినప్పటి నుంచీ వుంది. నదులంటే..ప్రవహించే జీవజలాలే. ప్రాణాలను నిలబెట్టే..అమృతరాశులే. నీరే లేకుంటే పరిస్థితి ఘోరంగా వుంటుంది. అందులోనూ ప్రాణప్రదాతలైన జీవనదులు..మనకి ప్రాణప్రదాలు. అందుకే జీవజలాలను ఎల్లవేళలా కాపాడుకుంటూ వుండాలి. జలజలపారే నదీనదాలను సంరక్షించుకొంటూవుండాలి. ఆ గురుతరమైన బాధ్యతను గుర్తుచేసేదే ఇటీవల తాజాగా ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన అద్భుతమైన తీర్పు.

ఇప్పుడే కాదు, ఎప్పుడూ నదులను కాలుష్యభరితం చేసుకోకూడదని, అందులోనూ గంగా-యమున వంటి జీవనదులను కూడా మనుషుల్లానే చూసుకుంటూ, వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ నదులకు 'మానవహోదా' ఇచ్చి వాటి సంరక్షణకు పటిష్టమైన చర్యలను సూచించింది. నదుల పరిరక్షణకు సంబంధించి ఇది ఎంతో ముఖ్యమైన అంశంగా అందరూ భావించాల్సి వుంటుంది. ముఖ్యంగా మన జనజీవనంలో.. భారతీయ ధార్మిక హృదయసీమలో ఒక భాగంగా కలిసిపోయిన నది ఏదైనా వుందీ అంటే... అది గంగానదేనన్నది అందరికీ తెలిసిందే. ఈ నది ఎంత స్వచ్ఛమైనదో.. అంత పవిత్రమైనది.. ఎంతో పుణ్య ప్రదమైనది.. పూజనీయమైనది కూడా. అయితే, స్వచ్ఛమైన జీవజలాలతో ఎప్పుడూ కళకళలాడే గంగ..యమున వంటి పవిత్రమైన జీవనదులు సైతం రానురాను కాలుష్య కాసారాలుగా మారిపోతుండడమే ఎంతో బాధాకరం. దేవభూమిలో పుట్టిన ఈ జీవ నదులకే ఇంతటి దురవస్థ వుంటే.. దేశవ్యాప్తంగా వున్న వేలాది సాధారణ నదుల పరిస్థితి మరెంత దయ నీయంగా వుంటుందో వూహకే అందడం లేదు. పట్టణాల్లోను, పల్లెల్లోనూ ప్రవహించే నదుల్లో మురుగునీరు ప్రతిక్షణం అపారంగా కలిసిపోతూనే వుంది. అనేక నదులు మురుగునీటితో నిండిపోయి వుంటాయి. ఇక వ్యర్థపదార్థాలైతే లెక్కే లేదు. దీంతో ఎక్కడ చూసినా నదుల్లోనూ చుట్టుపక్కల అంతా దుర్గంధపూరిత వాతావరణమే. నదులను కాపాడుకోలేక పోవడంతో అనేక నదులు ఎండిపోతున్నాయి. మరికొన్ని కాలుష్యంతో నిండిపోతున్నాయి. అంతెందుకు, మనదేశంలో ఎంతో పవిత్రమైన నదిగా..జీవనదిగా పేరొందిన యమునా నది కాలక్రమేణా జీవం కోల్పోయి మృతనదిగా మారిపోయిందంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు రెండేళ్ళ క్రితమే ప్రకటించిందంటే మన నదుల పరిస్థితి ఎంత దయనీయంగా వుందో తేటతెల్లమవుతోంది. ఈ నేపథ్యంలో గత కొంతకాలం క్రితమే గంగా-యమునా నదుల ప్రక్షాళనకు, వాటి పునరుద్ధరణకు ప్రధాని మోదీ సారధ్యంలోని కేంద్రప్రభుత్వం సంకల్పించడం ఎంతైనా ముదావహం. ఇప్పుడు తాజాగా ఉత్తరాఖండ్ న్యాయస్థానం ఆ రెండు జీవనదులను ప్రాణమున్న జీవులుగానే పరిగణించాలని, అవి చట్టబద్ధ జీవులని, ఒక మనిషికి వుండే హక్కులన్నీ ఆ రెండు నదులకు కూడా వుంటాయని తీర్పు చెప్పడంతో ఆ నదులకు మళ్ళీ జీవం వచ్చినట్లయింది. ఆ నదీమతల్లులకు న్యాయస్థానం 'మానవ హోదా' ఇవ్వడం కూడా చరిత్రాత్మకమే. గతంలో ఇదేవిధంగా, న్యూజిలాండ్ దేశంలోని వాంగనూయ్ నదికి ఇలాంటి హోదాయే వుందంటూ ఈ సందర్భంగా హైకోర్టు ఉదహరించింది. తాజాగా ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన అనంతరం ఉత్తరాఖండ్ హైకోర్టు ఆ మేరకు తీర్పు వెలువరించడం విశేషం.. జస్టిస్ రాజీవ్‌శర్మ, జస్టిస్ అలోక్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఆ మేరకు ఈ విశిష్టమైన తీర్పుచెప్పింది. అంతేకాదు, ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అడ్వొకేట్ జనరల్ ఇద్దరూ ఆ రెండు నదులకు తల్లిదండ్రులుగా వ్యవహరిస్తారని, ఇకనుంచి ఆ నదుల సంరక్షణకు ఆ ఇద్దరూ బాధ్యత వహిస్తారని కూడా తీర్పులో ప్రకటించడమే కాక, అందుకు అనుగుణంగా ఎనిమిది వారాల్లోగా గంగ యాజమాన్యబోర్డును ఏర్పాటు చేయాలని కూడా ఉత్తరాఖండ్ హైకోర్టు కేంద్రప్రభుత్వానికి సూచించి ఆ జీవనదుల సంరక్షణకు శ్రీకారం చుట్టింది. వేనవేల సంవత్స రాలుగా భారతీయులు అత్యంత పవిత్రంగా భావించే గంగ, యమున నదులకు దేశంలోనే ఇలా తొలిసారిగా 'మానవ హోదా' కల్పించి న్యాయస్థానం తన విశిష్ట తను చాటుకుంది. అయినా.. తన పుత్రుల్లో ఎవరో ఒకరు తనను శుభ్రపరచకపోతారా అని గంగామాత ఎదురుచూస్తోందని ప్రధాని మోదీ గతంలో ఒక సందర్భంలో అనడమే కాదు, అందుకు తానే ప్రతిస్పందించి రెండేళ్ళ క్రిందటనే ఆ బృహత్కా ర్యానికి అవసరమైన కీలకభూమికనంతా సిద్ధం చేసి గంగామాతపై తనకున్న భక్తిని, చిత్తశుద్ధిని చాటు కున్నారాయన. అంతేకాదు, అక్షరాలా ఇరవైవేల కోట్ల రూపాయల వ్యయం అంచనాతో 'నమామి గంగ' ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టి సాక్షాత్తూ తాను గంగామాత పుత్రుడని కూడా రుజువు చేసుకున్నారు. అందుకు తగ్గట్టుగా ఆ నదులకు మానవహోదా ఇస్తూ హైకోర్టు ఇచ్చిన తాజాతీర్పుతో ఇక ఈ నదులకు ప్రాణప్రతిష్ట జరిగినట్లే భావించవచ్చు.

ఇదేవిధంగా, మన ప్రాంతాల్లో వున్న నదులు, నీటి వనరులను కూడా మనం కాపాడుకోవడం..అవి కాలుష్యం కోరల్లో చిక్కుకోకుండా పరిరక్షించుకోవడం ఎంతైనా అవసరం. అది మనందరి తక్షణ కర్తవ్యం కూడా!..'జలచైతన్యమే..జనచైతన్యం'గా..అదే పరమావధిగా భావించి, మన మనుగడకు ప్రాణప్రదమైన నదీనదాలను, జీవజలాలను పరిశుభ్రంగా వుంచుకుని, నీటివనరులను సంరక్షించుకుని.. చివరికి వాననీటి చుక్కలను కూడా పరిరక్షించుకుంటూ మన తరానికే కాక.. భావితరాలకు కూడా మనం మార్గదర్శకం కావాల్సివుంది. ఆ మహత్కార్యానికి ఎవరికి వారే చిత్తశుద్ధితో సంకల్పం చెప్పుకుని.. అందుకు అందరూ ఇప్పటినుంచే సమాయత్తం కావాల్సివుంది.

### జీవ'నది'తరంగాలు



భారతీయులు అత్యంత పవిత్రంగా భావించే గంగ, యమున నదులకు తొలి సారిగా 'మానవ హోదా' కల్పిస్తూ ఉత్తరాఖండ్ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు అత్యద్భుతం. నదులకు సంబంధించి దేశంలోనే ఇది తొలి చరిత్రాత్మక తీర్పు అనవచ్చు. ప్రధాని మోదీ గతంలోనే గంగానది ప్రక్షాళన.. పున రుజ్జీవానికి సంకల్పించి.. ఆ మహత్కార్యానికి 20వేల కోట్లు కేటాయించి, 'నమామి గంగ' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టివున్న నేపథ్యంలో..ఈ తాజా తీర్పుతో ఆ నదులకు ప్రాణప్రతిష్ట జరిగినట్లేనని భావించవచ్చు.

## సాయిదర్బార్‌లో ఉగాది, శ్రీరామనవమి మహోత్సవాలు



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్(అద్దాల మందిరం)లో ఉగాది, శ్రీరామ నవమి మహోత్సవాలు, అఖండ శ్రీ సాయినామ సంకీర్తన సప్తాహ మహాయజ్ఞం మంగళవారం వైభవంగా ప్రారంభ మైందని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయ న్నారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 5గంటలకు కాకడహారతి, 6గంట లకు సాయినాథునికి ప్రత్యేకాభిషేకాలు, ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఓం సాయి శ్రీ సాయి జయజయసాయి అఖండ సాయి నామసంకీర్తన, ఉదయం 9గంటలకు సీతారామచంద్రుల వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు.

## గీతాంజలిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమ వారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపక బృందానికి ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరులోని క్లారిటీ ఆప్టికల్స్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు తెలిపారు. కళాశాల కరస్పాం డెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్.మహేష్‌కుమార్, డైరెక్టర్ ఫణి కుమార్, కళాశాల పిడి అశోక్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదం, యోగా కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆయుర్వేదం, యోగ సంబంధిత కోర్సుల్లో 3నెలలు ఉచిత శిక్షణ నిమిత్తం ఆసక్తిగల 18 నుండి 35 సంవత్సరాలు గల 10వ తరగతి పాసైన యువతీయువకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్.లోకనాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌లో లైఫ్‌సైన్స్(జీవశాస్త్రం) చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పేరును http://jobskills.apssdc.lmలో ఏప్రిల్ 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.




## విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నాం

నెల్లూరుజిల్లాలో పెరికబలిజ కులస్తులకు బి.సి-బి సర్టిఫికేట్లు ఇవ్వక పోతుండడంతో విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నాం. గతంలో 'లాయర్' పత్రిక ద్వారా మా సమస్యను గుర్తించిన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అసెంబ్లీలో ఈ సమస్యపై గళమెత్తారు. సీఎం, బి.సి, రెవెన్యూ శాఖల మంత్రుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. చిత్తూరు, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, కడప జిల్లాల్లో పెరిక బలిజలకు బి.సి-బి సర్టిఫికేట్లు ఇస్తుంటే నెల్లూరులో మాత్రం ఇవ్వడం లేదు. మరోమారు ఈ సమస్యపై అసెంబ్లీలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడాలని పెరికబలిజల ఆకాంక్ష. దీనిపై వెంటనే జి.ఓను విడుదల చేయించేలా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కృషి చేయాలి.

**సుంకర మహేష్‌బాబ్జీ, నెల్లూరు.**

## ప్రపంచానికిదేనా చెప్పింది!

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నోరు తెరిస్తే నేను ప్రపంచానికి పాఠాలు చెప్పానంటాడు. ప్రపంచాధినేతలు నా కోసం ఎదురు చూస్తారంటాడు. ప్రపంచానికి ఆయన నేర్పిన పాఠాలు తిట్లేనా? ఆయన తమ్ముళ్ళు వివిధ హోదాల్లో వున్న అధికారులను ఎట్లా బడితే అట్లా తిడుతున్నారు. వారికి చంద్రబాబు ఇవే పాఠాలు చెప్పాడా? మొన్నటికి మొన్న కృష్ణాజిల్లాలో ఎంపీ దివాకర్‌రెడ్డి ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైతే... అక్కడకు ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి వెళ్లాడు. బస్సు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ మృతదేహానికి పోస్టుమార్టమే చేయలేదేమని నిలదీసినందుకు ఆయన మీద కేసులు పెట్టారు. ఆరోజు అతను ప్రజలపక్షాన నిలదీసాడు. కాని ఇప్పుడు తెలుగుదేశం నాయకులు తమ వ్యాపారాల కోసం, స్వలాభాల కోసం అధికారులపై దౌర్జన్యాలు చేస్తున్నారు. అలాంటివారిపై మాత్రం కేసులుండవు. ఇదేనా చంద్రబాబు ప్రపంచదేశాలకు బోధించే నీతి.

**– సి.పి.రాఘవ, రాపూరు.**


## గెలుపోటములు ధనాధీనము

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం విజయం ఆశ్చర్యం కాదు గాని, కడపలో వై.యస్.వివేకానందరెడ్డి ఓటమి ఆశ్చర్యపరిచేదే! నెల్లూరులో వాకాటి నారాయణరెడ్డి 200ఓట్ల మెజార్టీతో గెలుస్తాడన్నారు. చివరకు 87ఓట్లతో గెలిచాడు. ఆనం విజయకుమార్‌రెడ్డి గట్టిగా మూలిగివుంటే ఇంకో 45ఓట్లు రాకపోవు. దురదృష్టం ఆయనను వెంటాడింది. మంత్రి నారాయణ పరిపక్వత లేని రాజకీయం, నిర్లక్ష్య ధోరణి వల్ల తెలుగుదేశం పార్టీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ఓడిపోయింది.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## తడ నుండి జిల్లా కడదాకా...

# ఆవిర్భవించిన 'నుడా'



*అభివృద్ధి జరిగినా జరగకపోయినా కొత్త కొత్త పేర్లతో కొత్త కొత్త సంస్థలను ఏర్పాటు చేయడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య! వ్యాపారాలలో ఉండే కొందరు పనులు లేకున్నా పనులను సృష్టిస్తుంటారు. చంద్రబాబునాయుడు కూడా అంతే... ఇక్కడ రాజకీయాలలో శూన్యత ఆవరించినా తనకంటూ ఏదో ఒక పని సృష్టించుకుని, రాష్ట్రంలో ఏదో అద్భుతం జరిగిపోతుందనే భ్రమలను ప్రజలకు కల్పిస్తుంటాడు. ఈ కోవలోనే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో ఏదో ఒక డెవలప్‌మెంట్ చేస్తున్నామని చెప్పుకోవడానికి కొన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఒకటి.*

నెల్లూరు, చిత్తూరుజిల్లాలో నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాల్టీలను కలిపి మొత్తం కావలి కడ నుండి తడ దాకా 21మండలాలు, 156 గ్రామాలతో 'నుడా'ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జి.ఓను జారీచేసింది. అపాయింటెడ్ నోటిఫికేషన్‌ను కూడా నెల్లూరు, చిత్తూరుజిల్లాల కలెక్టర్లకు పంపించారు. నెల్లూరుజిల్లాలో జాతీయ రహదారికి ఇరువైపులా వుండే కావలి, జలదంకి, బోగోలు, దగదర్తి, అల్లూరు, కొడవలూరు, కోవూరు, నెల్లూరురూరల్, టీపీ గూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు, గూడూరు, చిల్లకూరు, ఓజిలి, నాయుడుపేట, డి.వి.సత్రం, సూళ్ళూరుపేట, తడ మండలాల్లోని 145 గ్రామాలు, చిత్తూరుజిల్లా పరిధిలోని సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలకు చెందిన 11గ్రామాలను 'నుడా'లో కలిపారు.

అపాయింటెడ్ తేదీ నుండి 'నుడా' అధికారికంగా మొదలైనట్లే! నెల్లూరు కేంద్రంగా 'నుడా' పనిచేస్తుంది. ప్రస్తుతానికి 'నుడా'కు పాలకవర్గాన్ని నియమించలేదు. దీనిలో ఛైర్మెన్ పదవి కీలకం. ముఖ్యమంత్రి ఆశీస్సులు ఎవరికి వుంటే వారికే ఈ పదవి దక్కుతుంది. ఇక స్పెషల్ గ్రేడ్ అధికారిని వైస్‌ఛైర్మెన్‌గా లేదా సిఇఓగా నిమించవచ్చు. ప్రభుత్వ శాఖల్లో మున్సిపల్, ఆర్థిక, విద్యుత్, రోడ్ల భవనాలు, ఎన్విరాన్‌మెంట్ శాఖలకు చెందిన అధికారులు ప్రభుత్వం తరపున డెవలప్‌మెంట్ అథారిటీలో సభ్యులుగా కొనసాగుతారు.

### మేయర్ అధికారాలకు కత్తెర

కార్పొరేషన్ పరిధిలో ఆదాయం వచ్చే మార్గం రియల్ ఎస్టేట్! కొత్తగా లే అవుట్ వేయాలన్నా, అపార్ట్‌మెంట్‌లు, భవన నిర్మాణాల ప్లాన్‌లు అప్రూవల్ కావాలన్నా కార్పొరేషన్ లేదా మున్సిపాల్టీలకే అధికారముండేది. ఇప్పుడు ఈ అధికారాలన్నీ కూడా 'నుడా'కు బదిలీ అవుతాయి. లే అవుట్‌లు వేసే వాళ్ళకు డిటిసిపి అప్రూవల్స్ నెల్లూరులో అందుతాయి. ఇంతకు ముందు పిటిసిపి అప్రూవల్స్ కోసం గుంటూరు పోవాల్సి వచ్చేది. ఆరు నెలలు తిరగాల్సి వచ్చేది.

### పరిధి చాలాపెద్దది

రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలున్నాయి. గతంలో కొన్ని నగరాలకే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను పరిమితం చేశారు. కాని, ఇప్పుడు సువిశాల ప్రాంతాలతో అర్బన్ డెవలప్‌మెంట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు దాదాపు సగం నెల్లూరుజిల్లాతో 'నుడా'ను ఏర్పాటు చేసినట్లయ్యింది. జిల్లాలో అతిపెద్ద పారిశ్రామిక కేంద్రమైన కృష్ణపట్నం పోర్టు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఇఫ్కో సెజ్, చింతవరం సెజ్, మేనకూరు సెజ్, మాంబట్టు సెజ్, శ్రీసిటీ సెజ్‌లే కాకుండా ఇసుక, సిలికా మైకాలున్న మండలాలు, ఆక్వాసాగు చేసే మండలాలు కూడా 'నుడా' పరిధిలోకే వచ్చాయి. కాబట్టి నెల్లూరు మేయర్ కంటే కూడా 'నుడా' ఛైర్మెన్ పదవి ఎంతో కీలకమైనది, విలువైనది కూడా కాబోతోంది.



## ప్రగతి దివిటీ... శ్రీసిటీ నెల్లూరుదే!

దేశంలో గుర్‌గావ్, నోయిడాల తర్వాత ఆ స్థాయిలో అభివృద్ధి పరంగా పరుగులు పెడుతున్న సెజ్ శ్రీసిటి! మన కళ్ళ ముందే పురుడుపోసుకుని రూపు దిద్దుకున్న ఓ పారిశ్రామిక అద్భుతం. దాదాపు 10వేల ఎకరాల్లో వివిధ దేశాలకు చెందిన వందకుపైగా పరిశ్రమలతో దినదిన ప్రవర్ధమానం చెందుతున్న పారిశ్రామిక వాడ ఇది! ఈరోజు దేశంలో చాలా నగరాలకు వెళుతున్న మెట్రో కోచ్‌లు ఇక్కడే తయారవుతున్నాయి. ప్రపంచప్రఖ్యాతిగాంచిన ఎన్నో కంపెనీలు తమ పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేసాయి. వివిధ దేశాలకు చెందిన ఎన్నో పారిశ్రామిక బృందాలు శ్రీసిటీని సందర్శించి ఇక్కడ మౌలిక సదుపాయాలను ప్రశంసించి వెళ్లాయి. అటు చెన్నైకు, ఇటు నెల్లూరుకు మధ్య జాతీయ రహదారిని ఆనుకుని వున్న శ్రీసిటీలో పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్తలు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి చేతులమీదుగా ప్రాణప్రతిష్ట జరిగిన శ్రీసిటీ ఈరోజు దేశంలోనే మేటిగా రూపుదిద్దుకుంది.

అయితే ఈ సెజ్ ముఖద్వారం నెల్లూరుజిల్లా పరిధిలో వుంటే మిగతా పార్ట్ అంతా చిత్తూరుజిల్లాలో వుంది. కేవలం తలకాయ మాత్రమే మన జిల్లాది. మెడ నుండి పాదం వరకు చిత్తూరుజిల్లాలో ఉన్నట్లు! కాబట్టి ప్రోటోకాల్ ప్రకారం కూడా చిత్తూరుజిల్లా పరిధిలోనే దీని కార్యకలాపాలు జరిగేవి. అయితే ఇప్పుడు ఆ లోటు తీరింది. శ్రీసిటీ సెజ్ మొత్తాన్ని నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి తీసుకొచ్చారు. దీంతో శ్రీసిటీ సెజ్ ఇక నెల్లూరుకు దగ్గరైనట్లయ్యింది.



## ఛైర్మెన్ గిరి...

# ఆదాలకు వస్తుందా?

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటును బలంగా ఆశించి చంద్రబాబు బుజ్జగింపుతో బలహీనపడి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ నుండి పక్కకు తప్పుకున్నాడు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఏ ఒక్కరూ ముందుకు రాని పరిస్థితుల్లో నేనున్నానంటూ ఆదాల ముందుకొచ్చాడు. నెల్లూరు లోక్‌సభ నుండి వైకాపాదే గెలుపు అని నూటికి 90మంది చెబుతున్న ఆ రోజుల్లో కూడా ఆయన లెక్కచేయకుండా టీడీపీ అభ్యర్థిగా నిలబడ్డాడు. ఆత్మకూరు సీటు విషయంలో చంద్రబాబు చేసిన పొరపాటు కారణంగా ఆ ఎన్నికల్లో ఆదాల ఓడాడు. లేకుంటే గెలిచినా ఆశ్చర్యం లేదు.

తెలుగుదేశం కోసం ఆరోజు లోక్‌సభకు పోటీ చేశాడు. ఓడిపోయాడు. పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయనకు పార్లమెంటు ఇన్‌ఛార్జ్ బాధ్యతతో పాటు అదనంగా నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్ పోస్ట్ కూడా ఇచ్చారు. అవి పార్టీ కార్యక్రమాలు పెట్టుకోవడానికి, పార్టీ సభ్యత్వాలు చేర్పించుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. ఏదన్నా అధికారిక పదవి వుంటేనే ఆదాల మాట జనం వింటారు. ఆయన వద్దకు జనం వస్తారు.

నెల్లూరు నుండి రిస్క్ చేసి ఓడిపోయాడు కాబట్టి తొలుత రాజ్యసభను ఆశించాడు. అయితే చంద్రబాబు వాటిని కొందరికే రిజర్వ్ చేసున్నారు. ఈమధ్యే స్థానిక సంస్థల ఎమ్మెల్సీని ఆశించాడు. వాకాటికి మాట చెప్పివున్నాను, మాట తప్పడం, మడమ తిప్పడం నా ఇంటా వంటా లేదు... దానిబదులు ఏదన్నా ప్రభుత్వ కార్పొరేషన్ ఛైర్మెన్ పదవి ఇస్తానులే అని హామీ ఇచ్చాడు.

ఎన్నికలకు గట్టిగా ఇంకో రెండేళ్ళ కాలం కూడా లేదు. చంద్రబాబు అదిగో ఇదిగో అంటే ఆర్నెళ్లకు గాని పని కాదు. ప్రస్తుతం 'నుడా' ఏర్పడింది. 'నుడా' ఛైర్మెన్ పదవికి ఆదాల పేరు వినిపిస్తోంది. ప్రస్తుతానికి దీని పరిధి పెద్దదేగాని, ఛైర్మెన్ పోస్ట్ ఆదాల స్థాయికి తగ్గది కాదు. ఆదాల దీనికి పోవడమంటే మున్సిపల్ ఛైర్మెన్‌గా చేసినోడు మునసబు ఉద్యోగం ఇంటర్వ్యూకు పోయినట్లుంటుంది. పదవులను అడ్డం పెట్టుకుని సంపాదించాలనే యావ లేదు కాబట్టి ఆదాలకు ఈ పోస్ట్ కూడా అనవసరం. ఆయన మనస్థత్వానికి అన్ని విధాలా సెట్ అయ్యేది టీటీడీ ఛైర్మెన్ పదవి. చదలవాడ కృష్ణమూర్తి పదవీ కాలం త్వరలో పూర్తి కావస్తోంది. కాబట్టి కొత్త ఛైర్మెన్ ఎంపిక తప్పదు. టీటీడీ ఛైర్మెన్ పదవి రావడం జీవితంలో ఓ అదృష్టం. ఆదాల ఆ అదృష్టం కోసం ప్రయత్నిస్తే బెటర్! టిటిడి ఛైర్మెన్‌గా ఉంటూ రేపు ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థిగానైనా ఎక్కడ నుండి పోటీ చేసినా ఇబ్బంది లేదు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు






శ్రీ షిర్డి సాయిబాబా జన్మదిన, శ్రీరామనవమి మహోత్సవములు

05-4-2017 బుధవారము నుండి 07-4-2017 శుక్రవారము వరకు

పై దినములలో ప్రతిరోజు
ఉదయం 7 గం॥ల నుండి శ్రీ బాబా వారికి
మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు
12 గంటల నుండి
సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు
జరుగును.

- పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/-లు చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది.
- తేది.9.03.2017 నుండి 04.04.2017వరకు ప్రతిరోజు సా॥ 4.30 గం.ల నుండి "శ్రీసాయి సచ్చరిత్ర" పారాయణము జరుగును.
- ప్రతిరోజు సాయంకాలం 6.30గం॥ల నుండి సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.

భక్తులు తమకు తోచిన విధముగా ధనరూపములోగాని, ద్రవ్యరూపములోగాని మందిర గుమస్తా వద్ద చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది. పై కార్యక్రమములలో భక్తులందరూ పాల్గొని బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి, వారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.

ఇట్లు:
కార్యవర్గము

శ్రీ షిర్డి సాయిబాబా మందిరము
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

## ఐజి ఆఫీసుకు చెంచిరెడ్డి

నెల్లూరులో ఏఆర్ డిఎస్పీగా పని చేస్తున్న చెంచిరెడ్డిని గుంటూరు ఐజి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజి కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు ఐజి కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. 2015 నుండి చెంచిరెడ్డి ఇక్కడ ఏఆర్ డిఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## నెల్లూరులో 'కాటమరాయుడు' సందడి

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'కాటమరాయుడు' 24వ తేదీ విడుదలైంది. దీంతో నెల్లూరులోని ఎస్2 థియేటర్స్, అర్చన, ఎం.జి మాల్ స్క్రీన్స్ వద్ద పవన్ అభిమానుల సందడి నెలకొంది. మొదటిరోజు మొదటి ఆట చూసొచ్చాక అభిమానులు మా హీరో సినిమా హిట్ ఇయ్యిందంటూ బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

## జడ్పీ సమావేశం

జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశమందిరంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ ఇన్‌ఛార్జ్ సిఇఓ డి.వసుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులందరూ పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆమె కోరారు.

## టిపిఓకు పదోన్నతి

నెల్లూరు కార్పొరేషన్‌లో పట్టణ ప్రణాళిక విభాగంలో టిపిఓగా పనిచేస్తున్న సుధాకర్‌ను పదోన్నతిపై కృష్ణాజిల్లా డిటిసిపిగా బదిలీ చేశారు. ఆ స్థానంలో తిరుపతి నగరపాలక సంస్థ టిపిఎస్‌గా వున్న షణ్ముఖరెడ్డి ఇక్కడికి వస్తారని సమాచారం.

## ఏపి ఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శిగా రవీంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపిఆర్ఎస్ఏ) రాష్ట్ర కార్యదర్శిగా నెల్లూరుజిల్లాకు చెందిన చొప్పా రవీంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో ఏపిఆర్ఎస్ఏ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు గ్రీవెన్స్‌డేలో అవలంభిస్తున్న కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని సిసిఎల్ఏకు అందజేయనున్నారు.

## ఇరుకళలమ్మ హుండీ రాబడి

నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం హుండీని సోమవారం లెక్కించారు. 2016 డిసెంబర్ 28 నుండి 2017 మార్చి 27వరకు హుండీ ద్వారా అమ్మవారికి 4,23,614రూపాయల ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ శైలేంద్రకుమార్, ఇ.ఓ యు.జానకి, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో జరిగింది.

# నెల్లూరు కబుర్లు

## బ్యాలెట్‌లా?... బుల్లెట్‌లా?

మీకు ఇంతకన్నా అభ్యర్థి దొరకలేదా? ఇప్పటికే నారాయణతో వేగలేకున్నాం, ఇప్పుడు వీడు కూడానా?... ఇలాంటి రాతలతో పట్టభద్రుల ఎమ్మెల్సీ బ్యాలెట్‌లను నింపేసారని తెలిసింది. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ఓడిపోవడం తెలిసిందే! ఓడిపోవడం ఒకెత్తయితే మొత్తం 14వేల పైచిలుకు ఓట్లు చెల్లకుండాపోతే అందులో 12వేల ఓట్లు ఇతని పేరుకు ఎదురుగా 'టిక్'లు పెట్టినవే! అది అతనికి పెద్ద కడుపుమంట! పోతే బ్యాలెట్‌ల మీద కొందరు ఓటర్లు నానా ఛండాలపు మాటలు వ్రాసినట్లు తెలుస్తోంది.

## కేసుల సత్వర పరిష్కారానికి... జాతీయ లోక్ అదాలత్


- పి.జె.సుధ

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 8వ తేదీన నెల్లూరులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి పి.జె.సుధ వెల్లడించారు. సోమవారం నెల్లూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలోగల న్యాయసేవాధికార కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా జిల్లా న్యాయమూర్తి జునైద్‌అహ్మద్‌మౌలానా ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాలలో జాతీయ లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అదాలత్‌లలో రాజీకి ఆమోదయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులతో పాటు సివిల్, ఫైనాన్స్, కుటుంబ వివాదాలు, యాక్సిడెంట్లు, మున్సిపల్ ప్రీ లిటిగేషన్ కేసులన్నింటిని పరిష్కరించడం జరుగుతుందని, ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 10గంటల నుండి అన్ని మండల కేంద్రాల్లో ఈ జాతీయ లోక్‌అదాలత్‌లు ప్రారంభమవుతాయని, కక్షిదారులు, న్యాయవాదులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

## రత్నం విద్యార్థుల ప్రతిభ అమోఘం




నెల్లూరు, మాగుంట లే-అవుట్‌లోని డా. కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ స్కూల్ విద్యార్థులు 2016-2017 స్పెల్ బీ ఇంటర్‌నేషనల్ వారు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో మొదటి తరగతి చదువుతున్న వేద కార్తికేయ సింగ్, నాల్గవ తరగతి చదువుతున్న మోహిత్ సాయి, సౌమిత్, ఐదవ తరగతి చదువుతున్న కమలినీ సుమన్, ఆరవ తరగతి చదువుతున్న అమిన్ సాహిల్ మరియు ఎనిమిదవ తరగతి చదువుతున్న సాయి హాసంతి అర్హత సాధించారు. అలాగే అసెంట్ వారు నిర్వహించిన పోటీ పరీక్షలలో ఐదవ తరగతి చదువుతున్న హిమదీప్‌రెడ్డి రూ.1,000/- నగదు బహుమతిని గెలుపొందాడు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో రత్నం జెన్ నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామూర్తి నాయుడు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కళ్యాణి, మేనేజర్ రాధాక్రిష్ణ మరియు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సింహపురి హాస్పిటల్ ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు డాక్టర్ సుస్మిత రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరురూరల్ చింతారెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలోని సింహపురి హాస్పిటల్లో క్షయవ్యాధిపై ఇటీవల రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుస్మితారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ దేశంలో 25శాతం కొత్త కేసులు వస్తున్నాయని, రెండుమూడు వారాలుగా జలుబు, చలి జ్వరం, ఊపిరితిత్తుల్లో నొప్పి, బరువుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు. డాక్టర్ సిఫార్స్ చేసిన మందులను వాడితే టి.బి వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు.

## సంబరంగా సోమిరెడ్డి జన్మదిన వేడుకలు




తెలుగుదేశం పార్టీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరంగా నిర్వహించారు. నెల్లూరు టిడిపి కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, అధికార ప్రతినిధి జడ్.శివప్రసాద్, నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం బీద రవిచంద్ర మాట్లాడుతూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పార్టీకి, కార్యకర్తలకు గుండెచప్పుడు లాంటివాడన్నారు. పార్టీ అధికారంలో వున్నా లేకున్నా నిరంతర కష్టపడి పనిచేసే వ్యక్తని కొనియాడారు. కోడూరు కమలాకర్‌రెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ధర్మవరపు సుబ్బారావు, వై.వి.సుబ్బారావు, బి.వి.లక్ష్మి, కార్పొరేటర్లు పొట్లూరు శైలజ, అంచూరు జానకి, మేకల రజని, వహీదా, దాసరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిండుగా కనిపించని మామిడి



కృత్రిమ రసాయనాలతో పండ్లను మాగబెట్టి ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడితే సహించేది లేదంటూ న్యాయస్థానాలు చేసిన హెచ్చరికలు సత్ఫలితాలనే ఇస్తున్నట్లుంది. ఎండాకాలం అంటే మామిడిపండ్ల సీజన్. వీటితో పాటు పుచ్చ, కర్బూజా, ద్రాక్ష, నేరేడు వంటి కాయలు మార్కెట్‌లోకి వచ్చినా ఈ సీజన్‌లో మామిడిపండే కింగ్! ఈ కాలంలో మామిడి పండు తినని మనిషంటూ ఉండడు. మామిడిపండ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు ప్రతి ఏడాది కాయ కాపుకు రాకముందే చెట్ల నుండి కోసి రసాయనాలతో మగ్గబెట్టేవాళ్ళు. దీనిమూలంగా పండు పైతొక్క నిగనగలాడుతుండేది, కోసి చూస్తే లోపలంతా చెడిపోయి ఉండేది. ఇలాంటి పండ్లు రుచిగా కూడా వుండవు. ఎవరైనా ఆరోగ్యం కోసం పండ్లు తింటారు. కాని రసాయనాలతో మాగేసిన మామిడిపండ్లను తింటే అనారోగ్యాలను కొని తెచ్చుకున్నట్లుండేది. న్యాయస్థానం దీని మీద చాలా సీరియస్‌గా స్పందించడమే కాక ఒకట్రెండు కేసుల్లో ఇలాంటి అకృత్యాలకు పాల్పడిన వ్యాపారులకు శిక్షలు కూడా వేసింది. దీంతో రసాయనాలతో మాగేసే విధానం తగ్గిపోవడంతో మార్కెట్‌లో మామిడి పండ్లు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. లేకుంటే ఇదివరకే మామిడి పండ్లు మార్కెట్‌లో గుట్టలు గుట్టలుగా ఉండేవి.

## ఏసి స్టేడియంలో స్వచ్ఛభారత్



నెల్లూరు ఏసి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాలను శుభ్రపరచి పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు వినుకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న స్వచ్ఛభారత్‌ను నిజం చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రధాని నరేంద్ర మోడీ 2014 అక్టోబర్ 2వ తేదీన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా ఢిల్లీ నగరంలో రోడ్లను ఊడ్చి శుభ్రం చేసి అందరికి మార్గదర్శకుడయ్యారన్నారు. క్లీన్ ఇండియా కొరకు ప్రతి శని, ఆదివారాలలో ప్రముఖులు, సినీతారలు రెండుమూడు గంటలపాటు ఇంటి చుట్టుపక్కల శుభ్రం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పిట్ల రాజారావు, వైస్ ప్రెసిడెంట్ జి.వి.కృష్ణయ్య, సంయుక్తకార్యదర్శి ఎన్.సాయిసుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

# పల్లెప్రజల దాహార్తి తీర్చండి

**జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి**



జిల్లాలో ఏ పల్లెలోనూ దాహార్తి లేకుండా పల్లెప్రజలకు తాగునీటి వసతులను వెంటనే కల్పించాలని జడ్పీఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధికారులకు సూచించారు. మార్చి 25న జడ్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు గ్రామాలకు వెళ్ళి అక్కడ ప్రజల స్థితిగతులను, వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఏ పల్లెలోనూ దాహం కోసం ఇబ్బందిపడకుండా తగు వసతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల నుంచి పలు ప్రాంతాల్లోని నీటివసతుల గురించి తెలుసుకున్నారు. తాగునీటికి ఇబ్బంది వున్న ప్రాంతాల్లో వెంటనే మంచినీటి వసతులు కల్పించాలన్నారు. ఈ వేసవిలో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్.కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామిరెడ్డి, నాగజ్యోతి, జడ్పీ ఇన్‌ఛార్జి సిఇఓ వసుమతి, సూపరింటెండెంట్‌లు రమేష్‌రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేతల జయంతి వేడుకలు చక్కగా చేద్దాం

**జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు**



ఏప్రిల్ 5న బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు, అదేవిధంగా ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి వేడుకలను చక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. ఈ నెల 27న జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులంతా ఆయా రోజుల్లో ఆ నేతలకు ఘనంగా నివాళులర్పించాలని, ఆ మేరకు ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. అంబేద్కర్‌భవన్‌లో మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని, పెయింటింగ్‌లు చేసి భవనాన్ని సుందరంగా రూపుదిద్దాలని అన్నారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధుల ద్వారా చేపట్టిన వివిధ పథకాల అమలుకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. పథకాల అమలులో నూరుశాతం లక్ష్యం సాధించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్-2 రంజిత్‌బాషా, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ మధుసూదనరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● టెన్త్ విద్యార్థుల్లో ఆందోళన

# చదివినోళ్ళు బేజారు

# చిట్టాలోళ్ళు హుషారు!



ఏడాది పాటు చదివారు. గ్యాప్ లేకుండా చదివారు. కంటి మీద కునుకులేకుండా చదివారు. ఆటలు మాని, సరదాలు వదిలి, సంతోషాలు మరచి కేవలం పుస్తకాల పురుగులై అక్షరం అక్షరం చదివారు. ఆ చదివిన ప్రతి అక్షరాన్ని తమ మెదళ్లలో నిక్షిప్తం చేసారు. ఏడాదిపాటు చదివిన చదువునంతా కూడా రెండున్నర గంటల పరీక్షల్లో ఉపయోగించుకోవాలి. ఏడాది పాటు చదివినా ఆ రెండున్నర గంటల పరీక్షల్లో ప్రతిభ చూపకపోతే, ప్రతి ప్రశ్నకు సమాధానం రాయలేకపోతే ఏడాది పాటు చదివిన చదువంతా కూడా దండగే! ఇంతటి టెన్షన్ మధ్య ఏడాదంతా కష్టపడిన విద్యార్థులు పరీక్షలు వ్రాస్తుంటారు. వాళ్ళకు అసలైన బాధ అప్పుడు వుండదు. ఏడాది పాటు చదువులు లేకుండా జులాయిలుగా జల్సాగా తిరుగుతూ, సినిమాలకు పోతూ, షికార్లు కొడుతూ కరెక్ట్‌గా పరీక్షల రోజున లీకైన ప్రశ్నాపత్రాలు పట్టేసి, దానికి ఆన్సర్లను బట్టీ పట్టేసి పరీక్షలు వ్రాస్తారు చూడండి... అలాంటివాళ్ళను చూసినప్పుడు ఏడాదంతా చదువుకున్న విద్యార్థులు పడే బాధ వర్ణనాతీతం.

ప్రస్తుతం టెన్త్ పరీక్షలు ముగిసాయి. ఈ పరీక్షలు ఏ తీరులో జరిగాయో చూసాం. కరెక్ట్‌గా పరీక్ష మొదలైన అరగంటలోపే ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో వచ్చేస్తుంది. ఆ వెంటనే దానికి జవాబులు కూడా రెడీ అవుతున్నాయి. ప్రతి ఎగ్జామ్ సెంటర్ లోనూ మొద్దబ్బాయిలకు అవి చేరుతున్నాయి. దీంతో చదువుకు న్నోడు, మొద్దోడు ఒకటే అవుతున్నారు. ఈ పద్ధతిలో మొద్దబ్బాయికే ఒక మార్కు ఎక్కువొచ్చినా ఆశ్చర్య పోవాల్సిందేమీ లేదు.

ముఖ్యంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థనే గబ్బు కొట్టిస్తున్న ఓ విద్యాసంస్థ యాజమాన్యం మాల్‌ప్రాక్టీస్‌ను, చిట్టాల సంస్కృతిని పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో ఆ విద్యాసంస్థల అధినేత చక్రం తిప్పుతున్నారు. విద్య వీళ్ళకు పెద్ద వ్యాపారం. చాలా ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రతిభ వున్న విద్యార్థు లకే సీట్లిస్తుంటాయి. కాని ఈ రాజకీయ నేత విద్యాసంస్థల్లో మాత్రం పొట్టకోస్తే అక్షరంముక్క రాని వారికి కూడా సీట్లిస్తుం టాయి. లక్షల మంది విద్యార్థులను చేర్చుకుని, వందల కోట్లలో ఫీజులు దండి వందల సంఖ్యలో ర్యాంకులు తెచ్చుకుని, దానిని దేశమంతా ప్రచారం చేసుకోవడం ఈ విద్యా సంస్థల యాజ మాన్యానికి అలవాటే! ఇక్కడ చేరిస్తే చదువురాని సన్నాసులను కూడా ఎలాగోలా గట్టెక్కిస్తారనే నమ్మకం తల్లిదండ్రుల్లో వుంది. అందుకే ప్రతిభావంతులతో పాటు మొద్దబ్బాయిలకు కూడా ఇక్కడ ప్రవేశాలుంటాయి. పరీక్షల సమయంలో ఇలాంటి వారిని పాస్ చేసేందుకు ఈ విద్యాసంస్థల యాజమాన్యం తమవంతు ప్రయత్నాలు చేస్తూనే వుంటుంది. ఇప్పుడు పేపర్లు లీక్ అయినా, మాల్‌ప్రాక్టీస్ జరుగుతున్నా, మొద్దబ్బాయిలకు చిట్టాలు అందు తున్నా అలాంటి ప్రయత్నాల్లో భాగమే! ఈ విద్యాసంస్థలు అనుసరిస్తున్న వ్యాపారాత్మక విపరీత ధోరణుల వల్ల సంవత్సరం పొడవునా కష్టపడి చదివిన విద్యార్థులు అన్యాయమైపోతున్నారు. చదివినోడితో పాటు చదవనోడు కూడా పదికి పది పాయింట్లు తెచ్చుకుంటే ఇక ప్రతిభావంతులను గుర్తించేదెవరు? వారికి ఫ్రీగా ఇంటర్ సీట్లిచ్చేదెవరు?

# ప్రలోభాలకు లొంగకుండా ఓట్లేసారు

**- ఎమ్మెల్సీలు విఠపు, యండపల్లి**



ఇటీవల జరిగిన ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారపార్టీ చేసిన ప్రలోభాలకు లొంగకుండా తమకు ఓట్లు వేశారని ఎమ్మెల్సీలు విఠపు బాల సుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులు అన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో వారికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విఠపు మాట్లాడుతూ ఈ విజయం మరింత బాధ్యతను పెంచింద న్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. యండపల్లి మాట్లాడుతూ అధికార పార్టీ ఓటర్లను అనేక ప్రలోభాలకు గురిచేసిందన్నారు. ప్రలో భాలు, బెదిరింపులకు లొంగకుండా తమకు మద్దతు ఇచ్చి గెలిపించినందుకు రుణపడి వుంటామన్నారు. ప్రధానంగా నిరుద్యోగ భృతి, రుణమాఫీ, దళితులకు ఉద్యోగాలు అంశాలను శాసనమండలిలో ప్రస్తావిస్తా మన్నారు. రానున్న రోజుల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేస్తా మన్నారు. వివిధ సంఘాల నాయకులు ధనలక్ష్మి, శ్రీదేవి, ముత్యంగౌడ్, వాసు, హరితాదేవి, నగేష్, నవకోటి, మోహన్ రావు, తులసీరాంబాబు పాల్గొన్నారు.

# అధికారులపై టీడీపీ నేతల దౌర్జన్యాలు దారుణం



ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎన్.బాలసుబ్ర హ్మణ్యం, ఆయన గన్‌మెన్ దశరథ్‌పై ఇటీవల విజయవాడలో టిడిపి ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్యే బోండా ఉమామ హేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, పోలీస్ హౌసింగ్ ఛైర్మెన్ నాగూర్‌బాబులు దౌర్జన్యానికి దిగడం దారుణమని ఏపి పోలీసు అధికారుల సంఘం, రవాణా అధికారుల సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. నెల్లూరు పోలీసు అధికారుల సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పోలీసు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీని వాసరావు, రవాణా అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సీతారామిరెడ్డి మాట్లాడుతూ హుందాగా వ్యవహరించా ల్సిన టిడిపి ప్రజాప్రతినిధులు అధికారుల పై దౌర్జన్యాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి అందుకు బాధ్యులైన వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కఠినచర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. నెల్లూరు డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎన్.శివ రామప్రసాద్ మాట్లాడుతూ తమ శాఖ కమిషనర్‌పై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చ రించారు. ఏపి పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం.గంగా ధర్, కోశాధికారి టి.గోపాల్ మాట్లాడుతూ టిడిపి నాయకులు చట్టాన్ని అవమానించి అధికారులపై దాడులు చేయడం హేయ మైన చర్య అన్నారు. పోలీసుల అధికారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వై.శ్రీహరి బాబు, జిల్లా అధ్యక్షులు మద్దిపాటి ప్రసాద రావు, తురకా శ్రీనివాసులు, బెల్లంకొండ రమణయ్య, ఆదినారాయణ, ఎంవిఐలు ఎం.బాలమురళీకృష్ణ, బిఆర్‌కె రెడ్డి, ఏఎంవిఐలు వై.వి.పూర్ణచంద్రరావు, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

# 2న రిచ్‌లో వైద్యశిబిరం



నెల్లూరు పొగతోటలోని రిచ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఏప్రిల్ 2వతేదీ మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు చిన్నపిల్లల పల్మనాలజీ(శ్వాసకోస సంబం ధిత సమస్యలు) పుట్టిన పిల్లల నుండి 18 సంవత్సరాలలోపు వయసుగల పిల్లలకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రిచ్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా॥ టి.రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం రిచ్ హాస్పిటల్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెన్నైలో ప్రముఖ చిన్నపిల్లల పల్మనాలజిస్టు మేజర్ కె.నాగరాజు తమ వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ శిబిరంలో చిన్నపిల్లలకు వచ్చే న్యూమోనియా, ఆస్తమా, పిల్లి గురకలు, ఆయాసం, కోరింత దగ్గు తదితర శ్వాసకోస సంబంధిత సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. చెన్నై వంటి మహానగరాలకు వెళ్ళకుండా ఇక్కడే అందుబాటులో ఉన్న వైద్యసేవలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.



నెల్లూరు తెలుగుదేశంపార్టీ ఆఫీసులో ఉగాది సందర్భంగా బుధవారం తెలుగుదేశంపార్టీ మొట్టమొదటి నెల్లూరుజిల్లా అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది యరగుడిపాటి చలపతిరావును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, తాళ్ళపాక అనురాధ, డాక్టర్ జడ్.శివప్రసాద్ తదితరులు

# పేదలకు మజ్జిగ సీసాలు



మజ్జిగను పంపిణీ చేస్తున్న రెడ్‌సంస్థ ప్రతినిధులు, నెల్‌క్యాస్ట్ కార్మికులు

పేదలకు అన్నదానం చేయడం సంతోషకరమని ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మగ్దూమ్ మొహిద్దీన్ తెలిపారు. గూడూరు పట్టణంలోని నిరుపేదలకు నిరాశ్రయులకు భోజన, మంచినీటి ప్యాకెట్లను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు సర్దాజుద్దీన్, అమ్మద్దీన్, జావేద్‌అలీ, ఆసిఫ్, సుబ్రహ్మణ్యం తదితరులున్నారు. నెల్‌క్యాస్ట్‌లో పని చేస్తున్న కార్మికుల సహకారంతో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు మజ్జిగ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు రామలింగం, రాజేష్, శ్రీధర్, చిన్న పాల్గొన్నారు.

# నెల్లూరు కవులకు ఉగాది పురస్కారాలు



ఈ నెల 28వ తేదీ హైదరాబాద్, ఫిల్మ్‌నగర్‌లోని నిర్మాతల కౌన్సిల్‌హాల్లో హైదరాబాద్ సినీ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన కవి, రచయిత, ఇంద్రజాలికుడు రాచపాళెం రఘు, కథా రచయిత పొట్లూరు సుబ్రహ్మణ్యంకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణ, సిని గేయరచయితలు సిరివెన్నెల సీతారామశాస్త్రి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, తెలుగు సినీ రచయితల సంఘం కల్చరల్ కమిటి ఛైర్మెన్ బలభద్రపాత్రుని రమణి పాల్గొన్నారు.

# నాగేశ్వరరావుకు జాతీయ కవితా పురస్కారం



చిత్తూరుజిల్లా పలమనేరు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో ప్రముఖ కవి కె.వి.నాగేశ్వరరావు రచించిన 'కాలం కాటేసింది' కవితకు ఉత్తమ జాతీయ కవితా పురస్కారం లభించింది. ఈనెల 27వతేదీ పలమనేరు శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ నాగేశ్వరరావును సన్మానించి అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పి.తులసీనాథంనాయుడు, డా॥ వి.ఆర్.రాసాని, పలమనేరు బాలాజీ, డా॥ ఆర్.రాజేంద్రరెడ్డి, డా॥ కె.కదిరప్ప పాల్గొన్నారు. నాగేశ్వరరావుకు ఇది 72వ జాతీయ కవితా అవార్డు. పలువురు సాహితీ అభిమానులు ఆయన్ను అభినందించారు.

# కమిటి అభివృద్ధికి కృషి చేస్తా

## - వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్ కోటేశ్వరరావు



ఛైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపడుతున్న బొల్లినేని కోటేశ్వరరావు

గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటి అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా ఆ కమిటీ ఛైర్మెన్‌గా నియమితులైన బొల్లినేని కోటేశ్వరరావు పేర్కొన్నారు. చిల్లకూరు మండలంలోని ముత్యాలపాడు సమీపంలో వున్న కార్యాలయంలో 25వ తేదీ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ఆదాయాన్ని పెంచడంతో పాటు రైతులకు విరివిగా సేవలందించేందుకు ప్రయత్నిస్తామని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా సోమిశెట్టి చెంచురామయ్య, కాగాపాడి వెంకటసుబ్బయ్య, పారిచర్ల శ్రీరామచంద్రయ్య, నెల్లూరు రామమూర్తి, వెంకటకృష్ణయ్య, బాలకృష్ణారెడ్డి, కొండూరు సుబ్బారెడ్డి, పుట్టి గోపాలనాయుడు, ఖలీల్, వాయిగండ్ల సుధాకర్, దందోలు రఘు ప్రసాద్‌రెడ్డి, నూతలపాటి మనోహర్ నాయుడు, తిరుమలశెట్టి శ్రీనివాసులు, పట్టాభిరెడ్డి తదితరులు సభ్యులుగా నియమింపబడ్డ విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వారు ఇక్కడి కార్యాలయానికి చేరుకుని పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# హత్య కేసు నిందితుడి అరెస్ట్



నిందితుని వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్

మనుబోలు మండలం కాగితాలపూరు ప్రాంతంలో జాతీయ రహదారిపై జరిగిన హత్య కేసుకు సంబంధించి కుమార్ అనే నిందితుడిని అరెస్ట్ చేసినట్లు గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. వివరాలిలా వున్నాయి. మనుబోలు మండలం కాగితాలపూరు జాతీయ రహదారి వద్ద గత ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఆదిమాల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వెంకటేశ్వర్లు, సుజాత అనే మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇదేక్రమంలో ఆ మహిళ నవీన్, కుమార్ అనే వ్యక్తులతో కూడా అక్రమ సంబంధం కలిగివుంది. దీంతో ఆ మహిళ, నవీన్ పథకం వేసుకుని వెంకటేశ్వర్లును మట్టుపెట్టాలని నిర్ణయించుకున్నారు. సుజాతతో వెంకటేశ్వర్లు కలిసి ఉన్న సమయంలో నవీన్ వెంకటేశ్వర్లుపై దాడి చేశాడు. మహిళకు చెందిన చున్నీతో గొంతు నులిమి చంపేశాడు. అప్పటి నుంచి పోలీసులు పలు కోణాలలో దర్యాప్తు చేసి హత్య కేసులో సంబంధం ఉన్న కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ఆ మేరకు కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నామన్నారు. మరో నిందితుడు నవీన్‌ను రైల్వే పోలీసులు మరో కేసులో అదుపులోకి తీసుకున్నారని, హత్య కేసును ఛేదించిన సిబ్బందికి రివార్డు ప్రకటిస్తున్నట్లు డిఎస్పీ తెలి పారు. కార్యక్రమంలో రూరల్ సిఐ అక్కేశ్వరరావు, ఎస్సైలు బాబి, గంగాధర్, సిబ్బంది మల్లిఖార్జునరావు, వెంకటేశ్వర్లు రాజు, ఆదినారాయణ, మస్తాన్, శ్రీధర్ తదితరులున్నారు.

## విద్యుల్లత హెల్త్ ఫౌండేషన్

# ఉచిత వైద్యశిబిరం



మాట్లాడుతున్న నాగిశెట్టి ధర్మయ్య

పేదలకు వైద్యం కోసం సహాయపడటం సంతోషంగా ఉందని నాగిశెట్టి విద్యుల్లత హెల్త్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. గూడూరు పట్టణంలోని జెమ్స్ పాఠశాలలో సింహపురి ఆసుపత్రి, విద్యుల్లత హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం రక్షించుకోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. కార్పొరేట్ వైద్యం అందని పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్న ధర్మయ్యకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహపురి ఆసుపత్రి వైద్యులు, సురేంద్రకుమార్, శశిధర్‌రెడ్డి, శ్రీలక్ష్మి, జెమ్స్, ప్రాస్‌పరో పాఠశాల కరస్పాండెంట్ శారద, దశరథరామిరెడ్డి, ప్రభాకర్‌రావు తదితరులు ఉన్నారు.



గుంటూరులో ఇటీవల జరిగిన కార్మిక క్రీడా పోటీల్లో గుంటూరు ఎమ్మెల్యే ఎమ్.వేణుగోపాల్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందుకుంటున్న గూడూరు నెల్‌క్యాస్ట్ కార్మికులు ఎన్.శివకృష్ణ, ఎన్.గమనియేలు



గూడూరు పురపాలక సంఘ పరిధిలో ప్రకటనల పన్నులు వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి సుమారు 20లక్షల రూపాయలు నష్టపరచిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని డబ్బులు వసూలు చేయమని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వైకాపా కౌన్సిలర్ నాసిన నాగులు



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 31.3.2017 నుండి
తేది. 6.4.2017 వరకు

ఈ వారం మేషంలో కుజ బుధులు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, మీనంలో రవిశుక్రులు, మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 5 బుధవారం శ్రీరామనవమి

**హేమలంబ సంవత్సర చైత్ర శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 31 | శుక్ర | చతుర్థి | రా॥ గం.12.32వ॥ |
| తేది. 1 | శని | పంచమి | రా॥ గం.10.06వ॥ |
| తేది. 2 | ఆది | షష్ఠి | రా॥ గం.7.36వ॥ |
| తేది. 3 | సోమ | సప్తమి | సా॥ గం.5.21వ॥ |
| తేది. 4 | మంగళ | అష్టమి | సా॥ గం.3.31వ॥ |
| తేది. 5 | బుధ | నవమి | ప॥ గం.1.20వ॥ |
| తేది. 6 | గురు | దశమి | ప॥ గం.11.45వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు పనివత్తిడి, శ్రమ ఎక్కువగా ఉంటుంది. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులు తమ అధికారులతో, సహచరులతో జాగ్రత్తగా మెలగండి. ఆరోగ్యం కూడా స్వల్ప ఇబ్బంది కలిగిస్తుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఖర్చుల భారం పెరుగుతుంది. అయినా అవసరాలలో డబ్బు అందుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం తగ్గుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, శ్రమ ఉంటుంది. పెద్దమొత్తాలలో లావాదేవీలను వాయిదా వేయండి. కొత్త పరిచయాలు బలపడతాయి. విద్యార్థులకు పరీక్షలు తృప్తి కలిగించగలవు. శుభకార్య ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు. ప్రయాణాలుంటాయి. ఆర్థిక పరిస్థితి బాగుండి ఆదాయము సంతృప్తికరము. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు కార్యసమర్థత బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త కాంట్రాక్టులు లభించగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. బంధుమిత్రులకు సహాయపడతారు. అదనపు ఆదాయముంటుంది. విలువైన నూతన వస్తు సామాగ్రిని సమకూర్చుకొంటారు. ఉద్యోగావకాశాలు లభించగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు అధికారులతో సన్నిహితత్వం ఉంటుంది. దూరప్రయాణాలుంటాయి. దిగువ ఉద్యోగులలో వర్కర్లతో పేచీలు రాకుండా జాగ్రత్తపడాలి. పరీక్షలను చక్కగా వ్రాస్తారు. ఆరోగ్యం ఫరవాలేదు. అనవసర విషయాలపై ఆందోళన చెందవద్దు. అనుకున్న పనులు సులువుగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు వృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబ సౌఖ్యముండినను కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగులకు రాబడి పెరుగుతుంది. బంధువులతో అభిప్రాయ బేధాలుంటాయి. విద్యార్థులు పరీక్షలందు శ్రద్ధ చూపాలి. పనుల వత్తిడి, అనుకున్న పనులు సవ్యంగా జరగక టెన్షన్ పడుతుంటారు. వ్యాపారవృద్ధి సరిగా ఉండదు. ఆర్థికావకాశాలు చేజారిపోయే పరిస్థితులుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు కార్యసమర్థత గుర్తింపు గౌరవాలు, అధికారుల అభిమానం పొందుతారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత కలదు. కొత్త పరిచయాలు వ్యాపకాలు పెరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థికస్థితి బాగుండి వ్యాపార వృద్ధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులు, షేర్లపై లాభాలుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగులు తమ అధికారులతో పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. శుభకార్యాల నిర్ణయంలో అనుకూలత తక్కువ. అనుకోని ప్రయాణాలుంటాయి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో సాగక, ఆదాయము తగ్గుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడుల విషయంలో తొందరవద్దు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనండి. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త వహించండి. సమస్యలను పరిష్కరించుకొనే చొరవ చూపుతారు. పరీక్షలు వ్రాయడం బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. చిన్నగాయాలు తగిలే అవకాశం ఉన్నది. అనుకున్న పనులు నిదానంగా జరిగి సానుకూలము కాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్థిరాస్తుల మీద, పెట్టుబడుల మీద రాబడి ఉంటుంది. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి. విద్యార్థులకు మంచి సామర్థ్యముంటుంది. విదేశీ ప్రయాణాలకు అనుమతులు, ప్రభుత్వం నుండి ఆర్థిక అనుమతులు అందుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, గృహోపకరణాలు కొత్తవి సమకూర్చుకొంటారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు కార్యసామర్థ్యం బాగుంటుంది. స్థిరాస్తులు, విలువైన వస్తువులు ఏర్పరచుకొనే అవకాశాలుంటాయి. బంధువర్గంలో స్వల్పంగా అనారోగ్య బాధితులుంటారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. సాంఘిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధువర్గం నుండి శుభవార్తలు వింటారు. కోర్టు కేసులందు అనుకూలత కలదు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ఉద్యోగుల బాధ్యతలు, కార్యక్రమాలు ప్రశాంతంగా సాగుతాయి. తరచు ప్రయాణాలుండగలవు. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. సోదరవర్గానికి మేలు జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. చేపట్టిన పనులను పట్టుదలతో సానుకూలం చేసికొనగలరు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు అధికారుల ఆదరణ, స్థానమార్పులుండవచ్చును. తరచు ప్రయాణాలుంటాయి. ఉద్యోగార్థులకు మంచి అవకాశాలుంటాయి. కుటుంబ సౌఖ్యం ఆరోగ్యం బాగుంటుంది. వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. తొందరపాటు మాటలు, ప్రవర్తన లేకుండా వ్యవహరించండి.

# దేశం నేతల గడ్డం పట్టుకున్న బాబు

శ్రీను గల్పిక

భేతాళకథ

పట్టువదలని విక్రమార్కుడు ఉక్కపోత కారణంగా తెల్లారుజామున 5గంటలకే నిద్రలేచాడు. పొద్దున 9 గంటల నుండి ఎండ మండిపోతుండడంతో ఎర్లీ హవర్స్‌లో డ్యూటీ ముగించుకోవాలనుకున్నాడు. అందుకే సీమా సెంటర్‌లో టీ తాగేసి పెద్దాసుపత్రికి కూడా పోకుండా నేరుగా బోడిగాడితోటలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటిక వద్దకు చేరి శవం కోసం మాటు వేశాడు. ఓ గంట తర్వాత చీప్ లిక్కర్ ఎక్కువై లివర్ చెడిపోయి చనిపోయిన వ్యక్తి ఫ్రెష్ శవం ఒకటి వచ్చింది. విక్రమార్కుడు ఆ శవాన్ని భుజాన వేసుకుని శ్మశాన వాటిక చుట్టూ తిరుగుతూ శవంలోని భేతాళుడిని పిలిచాడు. విక్రమార్కుడి పిలుపుతో శవంలోని భేతాళుడు రియాక్టై... విక్రమార్క... ప్రజలు తమ వంటను ఇళ్లల్లో గ్యాస్ పొయ్యిల మీద కాకుండా, వీధుల్లో, రోడ్ల మీద ఎండ వేడిమితోనే పూర్తి చేస్తున్న ఎండలు కాస్తున్న రోజుల్లో నువ్వు పడుతున్న శ్రమ చూస్తుంటే నాకు జాలితో కూడిన దయ కలుగుతోంది. ఈ శ్రమ తెలియకుండా వుండేందుకు నీకు లేటెస్ట్‌గా జరిగిన 'పచ్చ నేతల తిట్ల పారాయణం' స్టోరీ చెబుతాను విను అంటూ మొదలుపెట్టాడు.

నేను మారిన మనిషిని నేను మారిన మనిషిని అని చెప్పుకుంటుంటే ప్రజలతో పాటు ఉద్యోగులు కూడా నమ్మి 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ఓట్లేసారు. 2004లో ఈ ఉద్యోగులే చంద్రబాబు ఓటమికి ప్రధాన పాత్రధారులు. పదేళ్ళ అధికార వియోగ శిక్ష భరించాక చంద్రబాబులోనూ ఆ మాత్రం మార్పు వచ్చుంటుందిలే అని ఉద్యోగులు నమ్మారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. అయితే ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు అధికారులను దుర్భాషలాడడం తగ్గించారు. 1995-2004 మధ్య సీఎంగా వున్న కాలంలో రోజుకో అధికారినైనా... 'నీ అంతు చూస్తా, నీ తాట తీస్తా' అని తిట్టందే చంద్రబాబుకు నిద్రపట్టేది కాదు. 2014లో అధికారంలోకి వచ్చాక రోజుకొకరిని కాదు కదా ఏడాదికొకరిని కూడా తిట్టలేదు. ఉద్యోగుల విషయంలో అంత మానవత్వమున్న మనిషిగా మారిపోయాడు. అయితే అధికారులకు అసలు సమస్య అక్కడే మొదలైంది. 1995 నుండి 2004ల మధ్య ప్రభుత్వంలో అధికారులను చంద్రబాబు ఒక్కడే తిట్టేవాడు. 2014 నుండి చంద్రబాబు ఒక్కడే తిట్టడం లేదు. తెలుగుదేశంలో వున్న మిగతా నాయకులందరూ అధికారులను దారుణంగా తిడుతున్నారు. ఒక ఎమ్మెల్యే అయితే వనజాక్షి అనే తహశీల్దార్‌ను ఇసుకలో జుట్టు పట్టుకుని ఈడ్చాడు. రాష్ట్రంలో చాలాచోట్ల అధికారులపై తెలుగు నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. తాజాగా విజయవాడలో రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంపై ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలు జులుం ప్రదర్శించారు. ఒక ఐపిఎస్ అధికారి అని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు తిట్టారు. బయటి రాష్ట్రానికి చెందిన ఓ ట్రావెల్స్ కంపెనీ బస్సు ప్రమాదం కేసుకు సంబంధించి ఉన్నది ఉన్నట్లు కాకుండా తాము చెప్పినట్లు నివేదిక ఇవ్వలేదని గొడవపడ్డారు. మీడియాలో ఈ దౌర్జన్యం సంఘటనలు ప్రసారమయ్యాయి. సీఎం చంద్రబాబు కూడా టీవీలో ఈ సీన్‌లు చూసాడు. ఆయన అసలే ఛండశాసనుడు... జరిగిన సంఘటనపై ఆయన తీవ్రంగా ఆగ్రహించినట్లున్నాడు. వెంటనే కేశినేని నాని, బోండా ఉమ, బుద్దా వెంకన్నలు ఆర్టీఏ కమిషనర్ వద్దకు వెళ్ళి క్షమాపణ చెప్పారు. తప్పు చేస్తే చంద్రబాబు క్షమించడని, అధికారుల మీద దౌర్జన్యాలకు దిగితే ఆయన తన మన అనే బేధం లేకుండా చీల్చి చెండాడుతాడని తెలిసి కూడా తెలుగుదేశం నాయకులు ఇలా అధికారుల మీద ఎందుకు దౌర్జన్యం చేస్తున్నట్లు? చంద్రబాబు అంటే వీరికి భయం పోయిందా? లేక మేం ఏం చేసినా ఆయన పట్టించుకోడులే అనే నమ్మకం పెరిగిందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో నువ్వు కూడా ఏపిలో ఏదో ఒక శాఖకు కమిషనర్‌గా ఉంటూ తెలుగుదేశం నేతల చేత ఇదే విధంగా తిట్లు తింటావని హెచ్చరించాడు.

అప్పుడు విక్రమార్కుడు... భేతాళా... పులి పళ్ళున్నప్పుడే పరుగెత్తయినా జింకను వేటాడగలదు. పళ్లూడిపోతే జింక ఎదురుగా వచ్చినా పీకేదేమీ ఉండదు. ఇప్పుడు చంద్రబాబు టీత్‌లెస్ టైగర్ లాంటోడు. ఒకప్పటి ఛండశాసనుడు ఇప్పుడు 'శాంతి శాసనుడు' అయ్యాడు. విజయవాడ ఘటన తర్వాత నీకు ఉండవల్లిలోని సీఎం ఇంట్లో జరిగిన ఓ సన్నివేశం చూపిస్తా చూడు అంటూ సెల్‌ఫోన్ తీసి ఫేస్‌బుక్ ఓపెన్ చేసాడు. అందులో ఓ పోస్ట్ ద్వారా వచ్చిన ఓ సన్నివేశంపై క్లిక్ చేశాడు.

★★★★★

అది చంద్రబాబు ఛాంబర్. చంద్రబాబు ఎదురుగా కేశినేని నాని, బోండా ఉమ, బుద్దా వెంకన్నలు ఉన్నారు. చంద్రబాబు వారితో... ఆ ఆర్టీఏ కమిషనర్‌ను ఏమన్నా అన్నారా... అని ఒకింత భయంతోనే అడిగాడు. అంటాం... కావాలంటే తిడతాం... ఇంకా ఎక్కువైతే కొడతాం... అయితే... ఏమవుతుందంట... ఒక ఆర్టీఏ కమిషనర్‌నే కాదు... అన్ని శాఖల కమిషనర్‌లను కొడతాం... ఏమవుద్ది... అలా కొడితేనే అందరూ దార్లో వుంటారు, మీకు అలా చేయడం చేతకాదు, చేసే మాలాంటివాళ్ళను ఇక్కడకు పిలిచి అడుగుతుంటారు. దీనికేనా మమ్మల్ని ఇక్కడిదాకా పిలిచింది అని కేశినేని నాని కోపంగా అడిగాడు. అందుకు చంద్రబాబు అతనితో... నువ్వే అంతలా కోప్పడితే ఎలా, ఏదో నిన్ను చూసి చాలా రోజులైందని పిలిపించాను, నిన్ను చూడాలనుకోవడం కూడా తప్పేనా అని బాబు అన్నాడు. బోండా ఉండి... చూడండి సార్, మీలా మెత్తగా వుంటే కుదరదు... అధికారులను ఎట్లబడితే అలా తిడతాం, అవసరమైతే కొడతాం... మనం బాధించాలి, వాళ్ళు భరించాలి. అది ఈ బోండా ఉమ రూల్. మీకు ఆసక్తి వుంటే చూడండి, లేకపోతే కళ్ళు మూసుకుని ఉండండి అని ఘాటుగా అన్నాడు. అప్పుడు చంద్రబాబు... మీరు ఏమైనా చేసుకోండి, ఎవరినైనా తన్నండి, ఇబ్బంది లేదు. కాని ఆ మీడియా దెబ్బకు పార్టీ ప్రతిష్ట కోల్పోతోంది. కాబట్టి ఎవర్ని తిట్టినా, కొట్టినా సంఘటన జరిగిన తర్వాత ఒక్కసారి 'సారీ' చెప్పండి, మిగతా అంతా నేను చూసుకుంటాను అని చెప్పాడు. అందుకు వాళ్ళు నిర్లక్ష్యంగా 'సరే సరే...' ఏదో నీ ఏడుపు కోసం ఆ 'సారీ' అయినా అంటూ లేచారు!

ఇక్కడితో సెల్‌ఫోన్‌లో సీన్ అయిపోయింది. తర్వాత విక్రమార్కుడే... తెలుగుదేశం ప్రభుత్వంలో తెలుగు తమ్ముళ్ళ పెత్తనమే నడుస్తోంది. చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని, పార్టీని కంట్రోల్ చేసే పరిస్థితి నుండి పడిపోయి పార్టీనేతలే ఆయన్ను కంట్రోల్ చేసే స్థితి వచ్చింది. చంద్రబాబే నేతలకు భయపడుతుండడంతో అధికారుల మీద పచ్చతమ్ముళ్ళ దౌర్జన్యకాండ యధేచ్ఛగా జరుగుతోందని చెప్పాడు. ఆ సమాధానానికి సంతృప్తి చెందిన భేతాళుడు శవాన్ని అక్కడే వదిలేసి పక్కనే వున్న సెల్ టవర్ ఎక్కేసాడు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో వెంకయ్య



కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. 31వ తేదీ ఉదయం 7.50నిమిషాలకు తిరుపతి చేరుకొని, ర్యాలీగా బయలుదేరి 9.30కు నెల్లూరులో ఉన్న పార్టీ ఆఫీసుకు చేరుకుంటారు. అక్కడే కార్యకర్తలను కలిసి మాట్లాడతారు. 11.00 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుని అక్కడ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఎఫ్.ఎమ్ రేడియోస్టేషన్‌ను ప్రారంభిస్తారు. అలాగే 8కోట్లతో నిర్మించనున్న ఇండోర్ స్టేడియంకు శంకుస్థాపన చేస్తారు. సుమారు 103కోట్లతో 800 పడకలతో నిర్మించిన ఏ.సి.సుబ్బారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఎ.సి.సుబ్బారెడ్డి మెడికల్ కాలేజ్ గ్రౌండ్లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. 12.00గంటలకు సర్దార్ పటేల్ నగర్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్, సంయుక్తంగా నిర్వహించనున్న ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పద్మభూషణ్ డా. బి.వి.రాజు ఫౌండేషన్, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రంలోని అడ్వాన్స్ కంప్యూటర్ శిక్షణా కోర్సులను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు అక్షరవిద్యాలయలోని 'జనాగ్రహ' కార్యక్రమంలో పాల్గొంటారు. 4.30గంటలకు స్వర్ణభారత్ ట్రస్టులో జరిగే ఉగాది ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత అవధాని డా. గరికపాటి నరసింహారావు పంచాంగ శ్రవణం చేస్తారు. 1వ తేదీ ఉదయం 9.00గంటలకు ఎ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో 'డిజి ధన్ మేళా'లో పాల్గొంటారు. 10.00గంటలకు శ్యామాప్రసాద్ రుర్బన్ పథకంలో ఆదర్శ మండలంగా ఎన్నికైన వెంకటాచలం మండలంలో 119 కోట్లతో తలపెట్టిన పనులకు భూమిపూజ చేస్తారు. 10.30 గంటలకు కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ పథకం అయిన 'రాష్ట్రీయ వయోశ్రీ'ని ప్రారంభించి వయోజనులకు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. 11.30 గంటలకు పిఎస్ఎల్‌వి–సి37 విజయంలో కీలకపాత్ర పోషించిన మహిళా సైంటిస్టులను అక్షరవిద్యాలయలో సన్మానిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు దక్షిణ భారతదేశ సినీ కళాకారుల ప్రతినిధి బృందాన్ని కలుస్తారు. అనంతరం అక్షర విద్యాలయలో హెలిపాడ్ నుండి హెలికాప్టర్లో బయలుదేరి మధ్యాహ్నం 2.00 గంటలకు గన్నవరం చేరుకుంటారు.

# గేట్‌లో టాప్ సుధీర్



ప్రభుత్వ పాఠశాలలో చదివినా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నెల్లూరుకు చెందిన కోవూరు సుధీర్ నిరూపించాడు. గేట్ ఫలితాల్లో మెకానికల్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి సత్తా చాటాడు. పేద కుటుంబంలో జన్మించిన సుధీర్ చిన్నతనం నుంచే చదువుపై ప్రత్యేకదృష్టి సారించి ఇప్పుడు గేట్‌లో ఆల్‌ఇండియా లెవల్‌లో ప్రథమస్థానం సాధించాడు. నెల్లూరు సుందరయ్యకాలనీలో నివాసముంటున్న సుధాకర్, గౌరి దంపతులకు పెద్ద కుమారుడు సుధీర్. తండ్రి ఎలక్ట్రీషియన్, తల్లి గృహిణి. సుధీర్ పులివెందులలోని జెఎన్‌టియులో బిటెక్(ఇఇఇ) ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. స్కూలు స్థాయి నుంచి టాపర్‌గా నిలిచేవాడు. నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో 10వ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. పదో తరగతిలో 600మార్కులకు గాను 582 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. కడప జిల్లా ఇడుపులపాయలోని ట్రిబుల్ ఐటిలో ఇంటర్ చదివి 9.7శాతం మార్కులు సాధించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం విడుదలైన గేట్ ఫలితాల్లో మెకానికల్ విభాగంలో ఆల్ ఇండియా ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా మంగళవారం కెఎన్ఆర్ పాఠశాలలో వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సుధీర్ తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఇళ్ళ మధ్యనే మద్యం దుకాణాలా?



తెలుగుదేశం ప్రభుత్వంలో మద్యం దుకాణాల తీరు విచ్చలవిడిగా మారిందని, ఇళ్ళ మధ్యనే మద్యం దుకాణాలు ఏర్పడుతున్నాయని, వీటిని తొలగించేందుకు ఉద్యమిస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌లు పేర్కొన్నారు. నెల్లూరులోని ఇందిరాభవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మద్యం దుకాణాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డి నాయకత్వంలో నెల్లూరు నుంచి ఆ మహాఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. పిసిసి అధికార ప్రతినిధి రఘురాం ముదిరాజ్ మాట్లాడుతూ, ఎక్సైజ్‌శాఖ అవినీతిశాఖగా మారిందని, మద్యం దుకాణాల నుంచి ఎక్సైజ్ స్టేషన్‌లకు నెలమామూళ్ళు వెళ్తున్నాయని ఆరోపించారు. వీటన్నిటిపై తమ పోరాటం సాగిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు పి.శేఖరరెడ్డి, ఉడాలి సూర్యనారాయణ, గణేష్, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆనందోత్సాహాలతో ఉగాది వేడుకలు

హేవళంబి నామసంవత్సర ఉగాది వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయబద్ధమైన ఈ వేడుకల్లో అందరూ ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఉగాది పచ్చడిని ఆరగించి, వేదపండితుల పంచాంగశ్రవణాన్ని ప్రజలు ఎంతో ఆసక్తిగా విన్నారు. నగరంలోనూ ఉగాది వేడుకలు ఎంతో కోలాహలంగా జరిగాయి. జడ్పీ పాతసమావేశ మందిరంలో ప్రభుత్వం తరఫున జరిగిన ఉగాది వేడుకలు నృత్యాలు, కవితా పఠనాలు, పంచాంగ శ్రవణాలతో ఎంతో సంబరంగా జరిగాయి. వివిధరంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, జేసి–2 రంజిత్‌బాషా, డ్వామా పి.డి హరిత తదితర జిల్లా ఉన్నతాధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తనకు తెలుగుభాషంటే ఎంతో ఇష్టమన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. వీటిని భావితరాల వారికి అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రముఖ వేదపండితులు, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు చింతలపాటి పూర్ణానందశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం జరిగిన సన్మానాల కార్యక్రమంలో జాతీయస్థాయిలో గేట్ పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించిన సుధీర్‌బాబును కలెక్టర్, ఎమ్మెల్సీలతో పాటు ఇతర ఉన్నతాధికారులందరూ అభినందించి సన్మానించారు. సుధీర్ తల్లిదండ్రులకు సుధీర్‌చేత కలెక్టర్ సన్మానం చేయించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టిన వూరిని మనం ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా విస్మరించకూడదని కలెక్టర్ అన్నారు.



## ఉత్తమ సేవలకు ఉగాది పురస్కారాలు :

ఈ సందర్భంగా పలురంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్నవారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. లక్ష్మీప్రసన్న (సంగీతం), కె.నాగభూషణం (నాదస్వరం), అమీర్‌జాన్ (చిత్రలేఖనం), వి.త్రినాథరావు (పౌరాణిక నాటకరంగం), ఏవి మల్లేశ్వరరావు (సాంఘిక నాటకరంగం), కె. రత్నం (సేవారంగం), సురభి గాయత్రి (భరతనాట్యం), వి.సతీష్‌కుమార్ (జానపద నృత్యం), ఈతకోట సుబ్బారావు (సాహిత్యం), డాక్టర్ పెళ్ళకూరు జయప్రద (రచనారంగం), కాళే చలపతిరావు (తోలుబొమ్మలాట), విద్వాన్ కిరణశ్రీ (సాహిత్యం)లు ఈ పురస్కారాలందుకున్నవారిలో వున్నారు. ఉగాది కవిసమ్మేళనంలో పాల్గొన్న పలువురు కవులకు కూడా ఘన సన్మానాలు జరిగాయి. ఈ సన్మానాలు అందుకున్నవారిలో నల్లు రమేష్, దువ్వూరు సుమలత, అవ్వారు శ్రీధరబాబు, ఎ.కరిష్మా, జె.మాధవాసుధ, బి.ఇందిరా కృష్ణ, ఎం.పెంచలనరసింహం, జి.లలిత ప్రవల్లిక, కెఎస్ కుమార్, బి.శశికళ వున్నారు.

# ప్రతిభకు పట్టాభిషేకం

## జిల్లాలో పలువురికి రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కారాలు



ప్రతిభకు పట్టాభిషేకం చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే ఉగాది పురస్కారాలను ఈ సారి నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు ప్రతిభావంతులు అందుకుని సింహపురి సీమ ఘనతను చాటారు. సంగీత గేయధార సృష్టికర్త, ప్రముఖ సారస్వతవేత్త, వెంకటగిరి రాజవంశీయుడు సాయికృష్ణ యాచేంద్ర 'ఉగాది కళారత్న' పురస్కారాన్ని అందుకున్నారు. అదేవిధంగా, ప్రఖ్యాత శాస్త్రవేత్త..మన జిల్లాకు చెందిన గుండ్రా సతీష్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపికయ్యారు. కొడవలూరు మండలం నార్తురాజుపాలెంకు చెందిన ప్రముఖ నాసికావేణుగానం కళాకారుడు సాయిహేమంత్, సంగీత కళాకారిణి జె.బాలార్క, యల్లాయపాళెంకు చెందిన డప్పు కళాకారుడు తల్లు శీనయ్య, కావలికి చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి జిబిఎస్ జాహ్నవి, హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ జిల్లా కో–ఆర్డినేటర్, కోట సునీల్ కుమార్ బుర్రకథ కళాకారుడు కట్టా మురళీ కృష్ణ ఈ ఘనపురస్కారాలను అందుకున్న వారిలో వున్నారు.

# కార్పొరేషన్ కమిషనర్‌గా ఢిల్లీరావు

విజయనగరం జిల్లా డిఆర్‌డిఏ పిడి ఎస్.ఢిల్లీరావు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈమేరకు ఈ నెల 24వ తేదీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. గురువారం ఆయన బాధ్యతలు తీసుకోవాల్సి వుండగా, ఆయన నెల్లూరు వచ్చేసరికి రాహూకాలం రావడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

# 2న గొలగమూడిలో శ్రీ సుదర్శన మహాయాగం

నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి ఆధ్వర్యంలో, గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి కల్యాణమండపం వెనుకవైపు వున్న ప్రాంగణంలో ఏప్రిల్ 2వ తేది ఎంతో విశిష్టమైన శ్రీ అష్టాక్షరీ మంత్రసహిత సుదర్శన మహాయాగం నిర్వహించనున్నట్లు ఆ సేవాసమితి నిర్వాహకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఇ.కె సుబ్రహ్మణ్యం తెలియజేశారు. యాగ కార్యక్రమాల్లో భాగంగా ఆ రోజు ఉదయం 8 నుంచి ప్రభాతభేరి, వేదపారాయణం, విశేష పూజల అనంతరం ఎంతో వైభవంగా సుదర్శన మహాయాగం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12గంటలకు మహానివేదన, పూర్ణాహుతి, కలశసంప్రోక్షణల అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు, అన్నప్రసాద వితరణ వుంటుందని వారు పేర్కొన్నారు. లోకకల్యాణం కోసం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ యాగంలో 41మంది వేదపండితులు పాల్గొని శాస్త్రోక్తంగా యాగ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, భక్తులందరూ ఈ కార్యక్రమాలను తిలకించి ఆ భగవంతుని కృపాకటాక్షాలను పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విజిలెన్స్ ఎస్పీగా

# శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి

నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఐఎఫ్ఎస్ అధికారి ఎస్.శ్రీకాంత్‌నాథ్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు మంగళవారం విజిలెన్స్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. విజిలెన్స్ ఎస్పీగా పనిచేస్తున్న రమేషయ్య గత ఏడాది డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో విజిలెన్స్ డిఎస్పీ పి.వెంకటనాథ్‌రెడ్డి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి జిల్లా విజిలెన్స్ ఎస్పీగా నియమితులయ్యారు. ఆయన గతంలో నెల్లూరు డిఎఫ్ఓగా పని చేశారు. శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

# ముగిసిన పోలేరమ్మ జాతర

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో కొలువైవున్న ముత్యాలమ్మ ఆలయంలో మూడురోజుల పాటు వైభవంగా జరిగిన పోలేరమ్మ జాతర 24వ తేదీ సాగనంపుతో వైభవంగా ముగిసింది. గంగమిట్ట మీద బుధవారం వేకువ జామున కొలువుదీర్చిన పోలేరమ్మకు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో మొక్కులు, ముడుపులు చెల్లించి పూజలు చేశారు. 24వ తేదీ తెల్లవారుజామున అమ్మవారికి ఏడు కుండల్లో వండిన అన్నం కుంభంపోసి నివేదించారు. పోలేరమ్మ పుట్టుక ఎలా జరిగిందనే కథను ఆసాదులు సవివరంగా వినిపించారు. గంగమిట్ట మీద నుంచి పోలేరమ్మ తల్లి ఉత్సవమూర్తిని నిమజ్జనం చేసేందుకు అమ్మవారు ఆవహించే గణాచారి నుంచి అనుమతి తీసుకున్నారు. అనంతరం గణాచారుల చిందులతో ముందు నడుస్తుండగా అమ్మవారికి నేత్ర పర్వంగా ఊరేగింపు నిర్వహించారు. పోలేరమ్మను సాగనంపే దారిలో మహిళలు కొత్త వస్త్రాలను దారి పొడవునా పరుస్తూ అమ్మవారికి వీడ్కోలు పలికారు. ఏడాదికి ఒకసారి వచ్చే పోలేరమ్మ తన



అక్క ముత్యాలమ్మకు వెళ్లొస్తానని పలకరించే సన్నివేశాన్ని గణాచారి ఆధునిక రూపంలో చెబుతుండగా అక్కడకు చేరుకున్న భక్తులు తన్మయత్వంతో పులకరించిపోయారు. అక్కా పోయివస్తనే... అంటూ పోలేరమ్మ అంటుండగా... వచ్చే ఏడాది మళ్లీ రా చెల్లి అని ముత్యాలమ్మ పలికినట్లు గణాచారి చెప్పడంతో పోలేరమ్మను ముత్యాలమ్మ ఆలయానికి కొంత దూరంలో ఉన్న జలంలో నిమజ్జనం చేశారు.

# పద్యవిద్యకు నేటికీ మంచి ఆదరణ

## - 'శ్రీ శ్రీనివాస కల్యాణము' పద్యకావ్యం ఆవిష్కరణలో వక్తలు

నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు రచించిన 'శ్రీ శ్రీనివాస కల్యాణము' పద్యకావ్యాన్ని ఈ నెల 25న స్థానిక టౌన్‌హాలులోని జూనియర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక మందిరంలో ఘనంగా ఆవిష్కరించారు. చిన్మయా మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతి ఆచార్య శ్రీహరి తీర్థస్వామి పాల్గొని ఈ కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హృద్యమైన పద్యాలనే భక్తిపుష్పాలతో చీమకుర్తి వెంకటేశ్వరరావు శ్రీనివాస కల్యాణాన్ని అత్యద్భుతంగా రచించి ఆ దేవదేవునికి సమర్పించారంటూ అభినందించారు. పద్యం తెలుగువారి సొత్తు అని, ఇది నిత్యనూతనమైన ప్రక్రియ అని ఆయన అంటూ, చీమకుర్తివారు సులభశైలిలో, అందరికీ బాగా అర్థమయ్యే రీతిలో ఈ పద్యకావ్యాన్ని రచించారని అభినందించారు. నేటి ఆధునిక కాలంలోనూ పద్యవిద్యకు మంచి ఆదరణ వుండడం అందరికీ ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు. పద్యరచనలో డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు రచనా ప్రతిభను అందరూ మెచ్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ పాల్గొని చీమకుర్తివారి పద్యరచనా వైశిష్ట్యాన్ని కొనియాడుతూ 'అక్షరాభిషేకం' పేరుతో పంచ పద్యరత్నాలను రచించి శ్రావ్యంగా చదివి వినిపించారు. అనంతరం చీమకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఆ తిరుమలేశుని అనుగ్రహంతోనే తాను పద్యకావ్యాన్ని రచించగలిగానని, ఆ ఏడుకొండలవాని కల్యాణవైభవాన్ని పద్యకావ్యంగా రచించడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్న ఈ ఆవిష్కరణోత్సవంలో ముఖ్య అతిథులుగా పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు అగస్త్యరాజు సుబ్బారావు, విశ్రాంత తెలుగు పండితుడు శివరామయ్య, బివి నరసింహం, ఊరుబిండి వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, ఆలూరి శిరోమణిశర్మ, త్వరకవి బాలకృష్ణమూర్తి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం పలువురు కవులను, పద్యకావ్య కర్తను ఘనంగా సత్కరించారు.

# రాష్ట్రంలో గూండా రాజ్యం!

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదని కేశినేని ట్రావెల్స్ అధినేత, విజయవాడ ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలు ఆర్టీఏ కమిషనర్ బాల సుబ్రహ్మణ్యంపై దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన ఈ ప్రభుత్వ అసమర్థతకు, రాష్ట్రంలో విస్తరిస్తున్న రౌడీరాజ్ సంస్కృతికి అద్దం పడుతోంది. రాష్ట్ర ప్రజలందరు కూడా ఈ సంఘటనను చూసారు. ఒక ఐపిఎస్ అధికారి నిబంధనల ప్రకారం తన విధులను తాను నిర్వహిస్తే తెలుగుదేశం ప్రజాప్రతినిధులు అతనికిచ్చిన బహుమానం బండబూతులు తిట్టడం. కొద్దిరోజుల క్రితమే, ఇదే కృష్ణాజిల్లాలో దివాకర్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురై 13మంది ప్రయాణీకులు మృత్యువాత పడ్డారు. సంఘటనా స్థలానికి వెళ్లిన ప్రతిపక్షనేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి బస్సు డ్రైవర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదేమని కలెక్టర్‌ను నిలదీసి అడిగిన పాపానికి అతని మీద కేసులు పెట్టారు. ఆరోజు జగన్ అడిగిన దాంట్లో న్యాయముంది. అయినా కేసులు పెట్టారు. మరి నిన్న ఆర్టీఏ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంపై తెలుగుదేశం నేతలు చేసిన దౌర్జన్యం పూర్తిగా అన్యాయం. ఆర్టీఏ కమిషనర్ లంచాల కోసం పీడిస్తుంటేనో, లేక పనుల కోసం తిప్పుకుంటుంటేనో వీళ్ళు జులుం చేసినా ప్రజలు పట్టించుకోరు. కాని వీళ్ళ ఉద్దేశ్యం పక్కా అన్యాయమని తెలిసిపోయింది. పోటీ ట్రావెల్స్ సంస్థను దెబ్బతీయాలని చెప్పి తప్పుడు రిపోర్ట్ కోసం ఆర్టీఏ కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చారు. అందుకాయన ఒప్పుకోలేదు. దాంతో వీళ్ళు ఐపిఎస్ అధికారని కూడా చూడకుండా, కనీస గౌరవమర్యాదలు లేకుండా ఇష్టమొచ్చినట్లు తిడుతూ దౌర్జన్యానికి దిగారు. జగన్ ప్రజల కోసం అధికారులను నిలదీస్తే కేసులు పెట్టిన ప్రభుత్వం, తమ వ్యాపారాల కోసం ఐపిఎస్ అధికారి మీద దౌర్జన్యం చేసిన సొంత పార్టీ నాయకులను మాత్రం 'సారీ'లు చెప్పించి వదిలేసింది.

### మొన్నటి సంఘటనలో...

పరామర్శకు ఆసుపత్రికి వెళ్ళిన జగన్ వద్దకి అధికారులే పరిగెత్తుకొచ్చి అనవసర రాద్ధాంతానికి కారకులయ్యారు. అక్కడ జగన్ ఏ అధికారివద్దకూ వెళ్ళలేదు, దౌర్జన్యం చేయలేదు. కాబట్టి జగన్ ఎవ్వరినీ క్షమాపణ అడగవలసినంత స్థాయిలో కూడా తప్పు జరగలేదు... కానీ ఈ నిరంకుశ ప్రభుత్వ పెద్దలు వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపైన కేసు నమోదు చేయించారు.

### నిన్నటి సంఘటనలో...

ఇక్కడ నేతలే ప్రభుత్వ కార్యాలయానికి దండుగా తరలివెళ్ళారు. అధికారులపైన దాడే లక్ష్యంగా వాదులాటకు దిగారు. అడ్డొచ్చిన గన్‌మెన్‌పై చేయి చేసుకున్నారు. అయితే ఈ సంఘటనలో ఖచ్చితంగా కేసు నమోదు చేయాల్సివుండగా ఇక్కడ మాత్రం కేవలం సారీ చెప్పించి సరిపుచ్చేశారు. ఈ సంఘటనే అధికారపార్టీ కుటిల నీతికి అద్దం పడుతుంది.

ఈ సంఘటనలో 'సారీ' అనే రెండక్షరాలతో తెలుగుదేశం నాయకులు బయటపడి వుండొచ్చు. సమస్యను రెండక్షరాలతో ముగించేసానని చంద్రబాబు చంకలు గుద్దుకోవచ్చు. కాని ఈ పరిణామాలకు భవిష్యత్‌లో తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేది చంద్రబాబునాయుడే! ఈ సంఘటనతోనే ప్రభుత్వం మీద ఉద్యోగులలో, ప్రజల్లో ఒక వ్యతిరేకత భావన వచ్చింది. సమస్యల పరిష్కారం కోసం అధికారులను నిలదీస్తే ప్రజలు హర్షిస్తారు, ఆమోదం తెలుపుతారు. నాయకులు తమ స్వార్థం కోసం అధికారుల మీద చేసే ఏ దౌర్జన్య కాండను కూడా ప్రజలు అంగీకరించరు.

తహశీల్దార్ వనజాక్షిని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇసుక రీచ్‌లో జుట్టుపట్టి ఈడ్చినప్పుడు చంద్రబాబు అతనిమీద సీరియస్ యాక్షన్ తీసుకోలేదు, సరికదా ఆరోజు వనజాక్షిదే తప్పన్నట్లు చంద్రబాబు పంచాయితీ తీర్చాడు. ఈమధ్య తమ ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటనకు సంబంధించి 'సాక్షి' పత్రికల్లో వచ్చిన కథనాలపై తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. ఆయన అనంతపురం 'సాక్షి' కార్యాలయం ఎదుట ధర్నాకు దిగి సభ్య సమాజం తలదించుకునే రీతిలో వై.యస్.జగన్‌ను తిట్టాడు. ఈ సంఘటనలను దేశవ్యాప్తంగా చూసారు. జేసీ నోట వచ్చిన మాటలను ఎవరూ హర్షించరు. తాగుబోతుల లాంగ్వేజీ వాడాడాయన. చంద్రబాబు తన గదిలోకి పిలిచి ఆయనను మందలించడం కాదు, ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని వుంటే ఈరోజు చంద్రబాబు పట్ల ప్రజల ఆలోచన ఇంకో విధంగా వుండేది.

చంద్రబాబేమో అభివృద్ధి కలలు కంటున్నాడు. నోరు తెరిస్తే దాని గురించే మాట్లాడుతున్నాడు. ఇక్కడచూస్తే తెలుగు తమ్ముళ్ళ అరాచకాలతో రాష్ట్రంలో పని చేయాలంటే అధికారులు భయపడుతున్నారు. పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు జంకుతున్నారు. ఏపి అభివృద్ధిలో కాదు, అరాచకాలలో బీహార్‌ను దాటిపోయేటట్లుంది.

# లీకు వీరులు!

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఇస్తున్న ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అలాంటి నైతిక విలువలు కలిగిన మంత్రులు ఉండాలనుకోవడం అత్యాశే అవుతుంది. టెన్త్ పేపర్ల లీకేజికి నైతికబాధ్యత వహిస్తే, ఈ విషయంలో ఆనాటి గాలి ముద్దుకృష్ణమనాయుడు సంఘటను స్ఫూర్తిగా తీసుకుంటే ఈ నెలలో విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రతిరోజూ రాజీనామా చేసి వుండాలి.

మన రాష్ట్రంలో విద్యావ్యవస్థ గబ్బు పట్టిపోయిందని, దానికి డబ్బు జబ్బు పట్టిందన్నది జగమెరిగిన సత్యం. రాష్ట్రంలో సర్కార్ చదువు చతికిలబడి, కార్పొరేట్ చదువులు రాజ్యమేలుతుండడానికి ప్రధాన కారకులలో ఒకరు మంత్రి పి.నారాయణ. ఈరోజు రాష్ట్రంలో పెరిగిన కార్పొరేట్ చదువుల సంస్కృతి దెబ్బకు మధ్యతరగతి కుటుంబాలు గుల్లవుతున్నాయి. డబ్బులు పెట్టి చదువులు కొనడం ఒకెత్తయితే, పేపర్ల లీకేజీతో కష్టపడి చదివిన విద్యార్థుల బ్రతుకులు, భవిష్యత్ చిత్తవుతుంది. ప్రస్తుతం జరిగిన టెన్త్ పరీక్షల్లో పలు సబ్జెక్టుల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం తెలిసిందే! మంత్రి నారాయణకు చెందిన విద్యాసంస్థల నుండే ఈ పేపర్లు లీకవుతున్నట్లు వెల్లడికావడం జరిగింది. నారాయణకు విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు వియ్యంకుడే! కాబట్టి పేపర్ల లీకేజీ విషయంలో వీరిద్దరి పాత్రపై అనుమానం రావడం సహజమే. ప్రతిపక్ష వైకాపా అసెంబ్లీలో ఇదే అంశాన్ని ప్రస్తావించింది. దీనిపై చర్చకు పట్టుబట్టింది. కాని, దీనిపై ప్రభుత్వం పెద్దగా స్పందించకుండా మంత్రులను కాపాడుకునే ప్రయత్నం చేసింది. అదేమంటే స్కూల్ వాటర్‌బాయ్, ఇన్విజిలేటర్లు ప్రశ్నాపత్రాలను ఫోటో తీసి వాట్సాప్‌లో పెట్టారంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేసింది. స్కూల్ వాటర్‌బాయ్‌కు ప్రశ్నాపత్రాన్ని లీక్ చేయాల్సినంత అవసరం ఏమొచ్చింది? పేపర్‌ను వాట్సాప్‌లో పంపేంత ధైర్యాన్ని అతనికిచ్చిందెవరు? ఎందుకోసం, ఎవరు చెబితే వాళ్ళు ఆ పని చేసుంటారు. లోతుగా విచారిస్తే దీని వెనుక సూత్రధారులెవరు, పాత్రధారులెవరు అన్న విషయం బయటకొస్తుంది. కాకపోతే కష్టపడ్డ విద్యార్థులు ఎటుపోతే మాకేం, మా మంత్రులకు నొప్పి తగలకుంటే చాలు అన్నట్లున్న ప్రభుత్వంలో పేపర్ల లీకేజీతో విద్యార్థుల బ్రతుకు డామేజీ కామనే!

# మండలికి మరొకరు?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లోనూ కడపజిల్లా ఇన్‌ఛార్జ్‌గా పార్టీ అభ్యర్థి విజయంలో తన ప్రతిభాపాటవాలు ప్రదర్శించాడు. మంత్రి పదవికి అన్నివిధాలా అర్హుడు. అనుభవమున్నోడు. జిల్లాలో పార్టీ కేడర్ కూడా ఆయనను మంత్రిగా కోరుకుంటోంది. అదీగాక నెల్లూరుజిల్లా రాజకీయాలలో 'రెడ్ల' ఆధిపత్యం ఎక్కువ. కాబట్టి ఆ వర్గానికి చెందిన సోమిరెడ్డికి మంత్రి పదవి రావొచ్చని భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా మారిన రాజకీయ పరిస్థితులలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేరు తెరమీదకొచ్చింది. బీసీల కోటా నుండి బీద పేరు బలంగా వినిపిస్తోంది.

ఇటీవల తెలుగుదేశంలో కులాల ఆధిపత్యపోరు ఎక్కువైంది. పార్టీకి మొదటి నుండి బీసీలు పునాదిగా వున్నారు. పార్టీలో మొన్నటి వరకు 'కమ్మ' వారి తర్వాత బీసీల ప్రాబల్యమే ఎక్కువ! కాని 2014 ఎన్నికల తర్వాత పార్టీలో కాపుల ఆధిపత్యం పెరిగింది. చంద్రబాబు తర్వాత పార్టీలో కాపు వర్గానికి చెందిన నారాయణ పెత్తనం ఎక్కువగా ఉంటోంది. బి.సిలకు చెందిన కె.ఇ.కృష్ణమూర్తికి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చినా ఆయనకు అధికారాలు లేకుండా చేసారు. మంత్రి పదవుల్లోనూ, పార్టీ పదవుల్లోనూ కాపుల ప్రాబల్యం పెరిగింది. అదీగాక కాపులకు రిజర్వేషన్లు అంటూ బి.సిలను అసంతృప్తికి గురి చేశారు. ఈ పరిణామాలన్నింటి దృష్ట్యా పార్టీకి బి.సిలు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని, బి.సిలను నిలుపుకోవాలంటే రేపు మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యతనివ్వాలని ఇటీవల కొందరు బి.సి నాయకులు చంద్రబాబును అడిగారు. ఈ బి.సి డిమాండ్‌లో భాగంగానే బీద రవిచంద్రకు అవకాశాలు కనపడుతున్నాయి.

అంతేకాదు, నెల్లూరుజిల్లాలో పార్టీ కేడర్ సోమిరెడ్డిని కోరుకుంటుండగా లీడర్లు మాత్రం రవిచంద్ర వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. సోమిరెడ్డి మంత్రి అయితే మంత్రిగా నారాయణ డమ్మీ అవుతాడు. అందుకే ఆయన బీదకు మద్దతుగా వున్నాడు. నారాయణ మాటకు చంద్రబాబు ఎలాగూ విలువ ఇస్తాడు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు కూడా సోమిరెడ్డికి కాకుండా రవిచంద్ర వైపే మొగ్గు చూపుతున్నారు. సోమిరెడ్డి మంత్రి అయితే తాము ఆయన వద్దకు వెళ్లాల్సి వస్తుంది. అదే రవిచంద్ర అయితే తాము సీనియర్లం కాబట్టి అతనిని తమ కంట్రోల్‌లో ఉంచుకోవచ్చన్నది వీరి ఉద్దేశ్యం. అలాగే ప్రకాశంజిల్లా నుండి మాగుంట శ్రీనివాసులురెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే నెల్లూరులో సోమిరెడ్డికి ఇవ్వలేదు. ఇన్ని సమీకరణలు సోమిరెడ్డికి అడ్డం పడుతున్నాయి.

అలాగని ఇప్పుడు సోమిరెడ్డికి తగిన ప్రాధాన్యత కల్పించకపోతే పార్టీ కేడర్ నిరుత్సాహానికి గురవుతుంది. అందుకే రవిచంద్రను మంత్రి వర్గంలోకి తీసుకునేది ఖాయమైతే అదే సమయంలో సోమిరెడ్డిని శాసనమండలి ఛైర్మన్‌గా నియమించే అవకాశముంది. అది కూడా సోమిరెడ్డి ఒప్పుకుంటేనే! ఒకవేళ ఈలోపు సమీకరణ మారి సోమిరెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకున్నా ఆశ్చర్యం లేదు!

రాజకీయాలలో అపరచాణుక్యుడిగా పేరుపొందిన చంద్రబాబు లాంటి నేత కూడా "నారాయణ" లాంటి బలహీనతలకు లొంగిపోక తప్పడం లేదు. జిల్లాలో పార్టీ సర్వనాశనమైపోయినా ఫరవాలేదు కానీ నారాయణని మాత్రం వదులుకునే పరిస్థితుల్లో ఆయన లేదు. ఈ తరుణంలో పార్టీని బలోపేతం చేసే నాయకుడే పార్టీకి అవసరం. చూద్దాం అదృష్టం ఎవరిని వరిస్తుందో...?

# మన కోసం ఢిల్లీలో పరితపించే శ్రేయోభిలాషి మన నాయుడు గారు

కొత్తూరులో... రూ. 10 కోట్లతో F.M. రేడియో స్టేషన్ భూమిపూజ 31 మార్చి,2017

నెల్లూరు నగరంలో పాస్‌పోర్టు సేవాకేంద్రం 31 మార్చి,2017

నెల్లూరు... ప్రభుత్వ వైద్య కళాశాలలో 784 పడకల అధునాతన వైద్యశాల ప్రారంభం. 31 మార్చి,2017

వెంకటాచలం అభివృద్ధికి డా॥ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం క్రింద రూ.119 కోట్ల పనులు ప్రారంభం భూమిపూజ 1 ఏప్రిల్,2017

మొగళ్ళపాలెంలో... రూ. 8 కోట్లతో ఇండోర్ స్టేడియం భూమిపూజ 31 మార్చి,2017

కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖచే వయోశ్రీ యోజన ప్రారంభం దృశ్య, శ్రవణ పరికరాల వితరణ వెంకటాచలం, స్వర్ణభారత్ ట్రస్ట్. 1 ఏప్రిల్,2017



## అన్ని ప్రాంతాల అభివృద్ధే ఆయన ధ్యేయం

- నెల్లూరు నగరానికి హడ్కో ద్వారా **అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు త్రాగునీటి** కొరకు రూ. **11 వందల కోట్ల** ఋణం.
- కోస్టల్ ఏరియా మెగా టూరిజం సర్క్యూట్ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని తీరప్రాంతాల **పర్యాటక అభివృద్ధి** రూ. 62 కోట్లు.
- గొలగమూడిలో కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖచే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ **(IITTM)** కు రూ. 30 కోట్లు.
- **నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ ట్రైనింగ్ 'NCERT'** కు రూ. 30 కోట్లు.
- **మానసిక వికలాంగుల పునరావాసం మరియు శిక్షణా కేంద్రం** ఏర్పాటుకు రూ. 25 కోట్లు.
- **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ NIOT** - రూ. 500 కోట్లు.

## అందుకే ఎప్పుడొచ్చినా ఏదో ఒక వరం

- ఉదయగిరి నియోజకవర్గం చింతలదేవి గ్రామంలో రూ. 25 కోట్లతో **కామధేను బ్రీడింగ్ సెంటర్**
- నెల్లూరు పట్టణ ప్రాంతాలకు **21,000 గృహాలు** మంజూరు.
- **EESL** క్రింద అన్ని **మున్సిపాలిటీల్లో వీధి దీపాలకు LED లైట్లు** మంజూరు.
- జిల్లాకు మరొక **కృషి విజ్ఞాన కేంద్రం.**
- **వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్.**
- కాకినాడ-పుదుచ్చేరి జల రవాణా మార్గం ద్వారా జిల్లాలోని **సముద్ర తీర ప్రాంతమంతా అభివృద్ధి.**
- విశాఖ - చెన్నై - బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు ద్వారా జిల్లా **పారిశ్రామికంగా అభివృద్ధి.**
- నెల్లూరులో **కేంద్రీయ విద్యాలయం.**

జిల్లాకి వచ్చిన ప్రతిసారి కేంద్ర, రాష్ట్ర పథకాలను వెంట తెస్తున్న

మన జిల్లా అభివృద్ధి ప్రదాత, ప్రియతమ నాయకులు
కేంద్ర పట్టణాభివృద్ధి మరియు
సమాచార – ప్రసార శాఖామాత్యులు

## శ్రీ ఎం. వెంకయ్య నాయుడు గారికి హార్ధిక స్వాగతం

గంటా రమణయ్య
గంటా పూర్ణచంద్రరావు
గంటా రమేష్‌బాబు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com